


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
సంపుటి: 5 సంచిక: 355, పేజీలు - 08
సోమవారం, జూన్ 15, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## మానేపల్లి రియాల్టీ అండ్ ఇన్‌ఫ్రా ప్రభుత్వ భూమిని

# 22-ఏ లో పెట్టండి


- సర్వే నెంబర్ 212 లవణ పట్టా ప్రభుత్వ భూమి కబ్జాపై కలెక్టర్ నిర్లక్ష్యం ఎందుకు.?
- రెవెన్యూ శాఖలో లేని కొత్త రూల్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ అమలు చేస్తున్నారా.?
- ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత కలెక్టర్ కు లేదా.?
- తహసీల్దార్, ఆర్డీవో రిపోర్టులు ఇచ్చిన కలెక్టర్ చర్యలకు వెనుకడుగు వెనుక అంతర్యం ఏమిటి.?
- ప్రభుత్వ భూమిపై కన్వేయన్స్ డీడ్ల వివాదం..
- చర్యలు మరిచి కలెక్టర్ మౌనం వెనుక రాజకీయ వత్తిడా.? ఆర్థిక లావాదేవీలా.?
- ఆర్డీవో, తహసీల్దార్ నివేదికలు ఉన్నా చర్యలు ఎందుకు లేవు.?
- ప్రభుత్వ భూములను కబ్జా చేయడానికి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నిర్లక్ష్యమే కబ్జాదారులకు ఆయుధమా.?






ప్రజాప్రశ్న
మానేపల్లి ఇన్ ఫ్రా
భూ బాగోతం బట్టబయలు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** జిల్లా కలెక్టర్ అంటే అంత ఆశా మాషి కాదు ఆయన విధినిర్వహణలో మకుటం లేని మహారాజు ఆయన తలచుకుంటే ప్రతి ఒక్కటి చక చక జరిగిపోవాల్సిందే అది నీతి బద్దంగా కానీ ఇటీవల కొంతమంది కలెక్టర్లు అవినీతికి, అక్రమాలకు పాల్పడుతూ అక్రమార్కులకు అండగా నిలుస్తూ ప్రభుత్వ ఖజానాకే గండికొట్టి ప్రభుత్వ ఆస్తులను నిలువు దోపిడి చేస్తున్నారు. కలెక్టర్ అనే మాటకు అర్థం లేకుండా తయారయ్యారన్న ఆరోపణలు సమాజంలో భారీగా వినిపిస్తున్నాయి. అబ్దుల్లాపూర్మెట్ మండల్ తుర్కయంజాల్ లోని సర్వే నంబర్ 212 లోని లావణ పట్టా ప్రభుత్వ భూమికి సంబంధించిన వ్యవహారం జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రెవెన్యూ అధికారులు, ఆర్డీవో నిర్వహించిన విచారణల్లో భూమి ప్రభుత్వానికి చెందినదేనని ఇంత భారీ మొత్తంలో జీవో నెంబర్ 59 ప్రకారము ఎవరికి రిజిస్ట్రేషన్ చేయలేదని తేలినట్లు సమాచారం ఉన్నప్పటికీ, ఇప్పటి వరకు కన్వేయన్స్ డీడ్ల రద్దుపై కలెక్టర్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది.కలెక్టర్ ఆదేశాల మేరకు అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్, ఆర్డీవో లు పూర్తి స్థాయి విచారణ నిర్వహించి నివేదిక సమర్పించినట్లు తెలుస్తోంది. అనంతరం ఆర్డీవో కూడా రికార్డులను పరిశీలించి సర్వే నెంబర్ 212 భూమి ప్రభుత్వ భూమేనని, జీవో నంబర్ 59 కింద కన్వేయన్స్ డీడ్లు జారీ చేయడం నిబంధనలకు విరుద్ధమని తన నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ కలెక్టర్ నుంచి తదుపరి చర్యలు లేకపోవడం పలు ప్రశ్నలను లేవనెత్తుతోంది.ప్రభుత్వ భూమిని 22-ఏ నిషేధిత జాబితాలో చేర్చాల్సిన పరిస్థితి ఉన్నప్పటికీ, ఎకరాల కొద్దీ భూమిని వ్యక్తుల పేర్లపై జీవో-59 పేరుతో ఎలా క్రమబద్ధీకరించారనే అంశంపై అధికారులు సైతం అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ భూముల పరిరక్షణ బాధ్యత రెవిన్యూ అధికారులపై ఉన్న నేపథ్యంలో రెవెన్యూ శాఖ నివేదికలను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ పరిగణనలోకి తీసుకోకుండా వ్యవహరించడం వెనుక కారణాలేమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.మానేపల్లి రియాల్టీ ఇన్‌ఫ్రా పేరుతో జరిగిన భూ లావాదేవీలపై ఇప్పటికే చాలామంది స్థానికులు ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. ప్రభుత్వ భూమిపై జరిగినట్లు చెబుతున్న ఈ వ్యవహారంలో కన్వేయన్స్ డీడ్లు రద్దు చేయాలని ఆర్డీవో లిఖితపూర్వకంగా సూచించినప్పటికీ, జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి స్పందన లేకపోవడం అనేక చర్చలకు దారి తీస్తోంది.ఇదే సమయంలో హెచ్ఎండీఏ అధికారులు కూడా రెవెన్యూ శాఖ తుది నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ భూమి కబ్జాపై వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో అనుమతుల రద్దు అంశం కలెక్టర్ పెండింగ్‌లో పెట్టడం అనేక అనుమానాలకు తావిస్తోంది. కలెక్టర్ కావాలని రద్దు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారా.? లేక కలెక్టర్ పై రాజకీయ వత్తిడి ఏమైనా ఉందా.? లేక కలెక్టర్ ఆర్థిక లావాదేవీలకు మౌనంగా ఉంటున్నారా.? అంటూ స్థానికులు పలు ప్రశ్నలు కురిపిస్తున్నారు. అయినప్పటికీ సంబంధిత ఫైళ్లపై నిర్ణయం తీసుకోవడంలో జరుగుతున్న జాప్యం వెనుక కారణాలేమిటన్నది స్పష్టత రావాల్సి ఉంది. మానేపల్లి రియాల్టీ ఇన్‌ఫ్రా లో ఇప్పటికే ప్లాట్లు కొనుగోలు చేసిన లేదా కొనుగోలు చేయాలని భావిస్తున్న ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఒకవేళ భవిష్యత్తులో ప్రభుత్వం ఈ భూమిని స్వాధీనం చేసుకుంటే, భారీ మొత్తాలు వెచ్చించి కొనుగోలు చేసిన వారి పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రారంభ దశలోనే వివాదాన్ని పరిష్కరించాల్సిన అధికారులు ఆలస్యం చేయడం వల్ల అమాయక కొనుగోలుదారులు నష్టపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ భూముల పరిరక్షణలో జిల్లా కలెక్టర్, జిల్లా యంత్రాంగం పారదర్శకంగా వ్యవహరించాలని, ఆర్డీవో, తహసీల్దార్ నివేదికలను ప్రజలకు వెల్లడించి వాస్తవ పరిస్థితిపై స్పష్టత ఇవ్వాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సర్వే నంబర్ 212 వ్యవహారంలో నిజాలు వెలుగులోకి తెచ్చి కబ్జాకారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారా? లేదా అన్నది ఇప్పుడు జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది.


Under the circumstances stated supra, the following regularizations and conveyance deeds are fit cases for cancellation in respect of Government land in Sy.No.212 extent Ac.5-23 gts situated at Turkayamjal village, Abdullapurmet Mandal in the interest of Government.

| Sl.No. | Name of the applicant | Extent Regularized | Conveyance Deed Number & Date |
|---|---|---|---|
| 1 | Boppana Sharadha Devi W/op late Kantha Rao | 5046 Sq. yards (Ac.1-01gts). | 5899/2016 Dt.17-08-2018 |
| 2 | Manepally Mamatha W/o Gopi Krishna | 5239.7 Sq.yards (Ac.1-03 gts) | 5898/2016 Dt.17-08-2018 |
| 3 | Manepally Srilatha W/o Gopi Krishna | 5239.8 Sq.yards (Ac.1-03 gts) | 5897/2016 Dt.17-08-2018 |
| 4 | Vumma Saraswathi | 11616 Sq. yards (Ac. 2-16 gts) | No.5896/2016 Dt. 17-08-2016. |

In view of the above facts and circumstances of the case, it is requested kindly to initiate appropriate action for cancellation of above regularizations and conveyance deeds which were executed by violating the procedure under G.O.Ms.59 Revenue (Assn.I) Department dated 30-12-2014.

Yours faithfully,
Revenue Divisional Officer,
Ibrahimpatan Division

Copy to the Tahsildar, Abdullapurmet for information.

కలెక్టరు కార్యాలయము
రంగారెడ్డి జిల్లా
07 MAY 2026

## దీదీకి లీగల్ నోటీసులు

### - పంపించిన టీఎంసీ రెబల్ ఎంపీ కొడుకు



**కోల్కతా (ప్రశ్న న్యూస్)** పశ్చిమ బెంగాల్‌లో అధికారం కోల్పోయినప్పటి నుంచి తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఎంపీలు, ఎమ్మెల్యేలు మాజీ సీఎం, టీఎంసీ అధినేత్రి దీదీకి ఎదురు తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలోనే అటు అధికారం పోవడంతోపాటు ఇటు పార్టీ నేతలు షాకిస్తుండటంతో మమతా బెనర్జీకి ఊపిరి సలపడం లేదు. ఈ క్రమంలోనే తాజాగా మరో సంఘటన చోటు చేసుకుంది. టీఎంసీ రెబల్ ఎంపీ కకోలీ ఘోష్ కుమారుడు డాక్టర్ బైద్యనాథ్ ఘోష్ దీదీకి లీగల్ నోటీసులు పంపించారు. దీదీతోపాటు పలువురు టీఎంసీ నేతలకు కూడా నోటీసులు

2లో..

## వర్షం వస్తే నేనే రోడ్డుపైకి వస్తా

- అధికారులపై సీఎం రేవంత్ సీరియస్
- అలసత్వం ప్రదర్శించే అధికారులపైన కఠిన చర్యలు
- కోర్ అర్బన్ రీజియన్ లో మరింత అప్రమత్తంగా ఉండాలన్న సీఎం
- వర్షం కారణంగా ట్రాఫిక్ జాం అయితే సహించను
- వర్షాల సమయంలో అధికారులు, పోలీసులు రోడ్ల పై ఉండాల్సిందే
- అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు





**హైదరాబాద్** వర్షాల సమయంలో అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆయన తేల్చిచెప్పారు. అలసత్వంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వర్షాకాల సన్నద్ధతపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు ఇరిగేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, వైద్య ఆరోగ్య శాఖ, పోలీసు శాఖ, వ్యవసాయ శాఖ, వాతావరణ శాఖల ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.జూన్ 9న కోర్ అర్బన్ రీజియన్‌లో వర్షం కారణంగా ఏర్పడిన పరిస్థితులపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. సైబరాబాద్‌తో పాటు అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ కావడంతో నగరవాసులు ఇబ్బందులు పడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినప్పటికీ మున్సిపల్, పోలీసు, ట్రాఫిక్ సిబ్బంది అప్రమత్తం కాలేదన్నారు . వర్షాల సన్నద్ధతపై జూన్ 1న సమీక్ష నిర్వహించి తాను స్వయంగా అనేక సూచనలు చేశానని గుర్తుచేశారు. అయినప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ముఖ్యమంత్రి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.జూన్ 9న వర్షం సమయంలో మున్సిపల్, పోలీసు అధికారుల మధ్య సమన్వయం లోపించిందన్నారు. ఈ పరిస్థితికి గల కారణాలను విశ్లేషించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్‌లను ఆదేశించారు. మరో సారి ఇలాంటి పరిస్థితి వస్తే కఠిన చర్యలు తీసుకుంటానని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.వాతావరణ శాఖ సూచనల మేరకు వర్షాలపై ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. వర్షం సమయంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, హైడ్రా, ట్రాఫిక్, జలమండలి సిబ్బందితో పాటు సివిల్ పోలీసులు కూడా క్షేత్రస్థాయిలో ఉండాల్సిందేనన్నారు. పోలీసు కమిషనర్ నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు రోడ్లపైకి రావాల్సిందేనని తేల్చిచెప్పారు. అవసరమైతే తాను కూడా రోడ్డుపైకి వస్తానని ముఖ్యమంత్రి అన్నారు. వర్షం కారణంగా

2లో..

## ఢిల్లీ వేదికగా

# జనసేన బిగ్ స్కెచ్

### - నేడు కీలక ప్రకటన.?



**అమరావతి (ప్రశ్న న్యూస్)** భారత రాజకీయాల్లో ప్రాంతీయ అస్తిత్వాన్ని కాపాడుకుంటూనే, జాతీయ సమైక్యతకు బలం చేకూర్చే సరికొత్త రాజకీయ సిద్ధాంతాన్ని బలంగా వినిపించేందుకు జనసేన సిద్ధమైంది. పార్టీ స్థాపించి పుష్కర కాలం పూర్తయిన సందర్భంగా, దేశ రాజధాని ఢిల్లీలోని ప్రతిష్టాత్మక అశోక హోటల్‌లో నేడు జనసేన విస్తృత స్థాయి సమావేశం జరగనుంది. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి “సేన ప్రస్థానం.. జాతీయ సమైక్యత కోసం” అనే పేరు ఖరారు చేశారు. కేవలం ఒక ప్రాంతానికో, రాష్ట్రానికో పరిమితం కాకుండా దేశ సమగ్రత కోసం ఒక రాజకీయ శక్తిగా ఎలా నిలబడాలనే అంశంపై ఈ వేదిక ద్వారా స్పష్టమైన ప్రకటన వెలువడనుంది.ప్రాంతీయతను విస్మరించని జాతీయ వాదం, భిన్న భాషలను గౌరవించే సంప్రదాయం, భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటే సంస్కృతులను కాపాడే సమాజం ఇవే పునాదులుగా జనసేన గత 12 ఏళ్లుగా ప్రయాణించింది. ఈ సుదీర్ఘ ప్రస్థానంలో జాతీయ సమైక్యతను కాపాడటానికి పార్టీ అనుసరించిన వ్యూహాలు, వర్తమాన భారతదేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై పవన్ కళ్యాణ్ లోతైన విశ్లేషణ చేయనున్నారు. ప్రాంతీయ

2లో..

# దీదీకి లీగల్ నోటీసులు

పంపించారు.టీఎంసీ రెబల్ ఎంపీ కకోలీ ఘోష్ కుమారుడు డాక్టర్ బైద్యనాథ్ ఘోష్ మమతా బెనర్జీకి తాజాగా లీగల్ నోటీసులు పంపించారు. దీదీతోపాటు ఆ పార్టీ ఎంపీలు కల్యాణ్ బెనర్జీ, సౌగతా రాయ్, మహువా మోయిత్రాలకు కూడా డాక్టర్ బైద్యనాథ్ ఘోష్ నోటీసులు పంపారు. బరసత్ అసెంబ్లీ సీటులో పోటీ చేసేందుకు తాను టీఎంసీ పార్టీ టికెట్ కోరినట్లు టీఎంసీ నేతలు చేసిన ఆరోపణలపై బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తాను పంపించిన నోటీసులకు స్పందించకపోతే పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరికలు చేశారు.ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న మమతా బెనర్జీ బరసత్ ఎమ్మెల్యే టికెట్ కోసం తనను కొందరు సంప్రదించినట్లు చెప్పారు. అయితేపలువురు సీనియర్ నేతలు ఒప్పుకోకపోవడంతో వారికి ఆ ఎమ్మెల్యే టికెట్ ఇవ్వలేదని తేల్చి చెప్పారు. ఎంపీ అయినంత మాత్రాన వారి కుటుంబంలోని అందరూ ఎంపీలు, ఎమ్మెల్యేలు కావాలా అంటూ కకోలీ ఘోష్‌పై పరోక్షంగా తీవ్ర విమర్శలు గుప్పించారు.ఈ క్రమంలోనే కకోలి ఘోష్ టీఎంసీ పార్టీని వీడడం మాత్రమే కాకుండా తన కొడుక్కు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వనందుకే బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమికి మద్దతు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే తనపై వస్తున్న ఆరోపణలను బైద్యనాథ్ ఘోష్ తీవ్రంగా కొట్టిపారేశారు. తాను ఎప్పుడూ పదవి కోసం ఆశ పడలేదని స్పష్టం చేశారు. తన పరువుకు, తన కుటుంబ పరువుకు నష్టం కలిగించేలా వ్యాఖ్యలు చేసినందుకు మమతా బెనర్జీతోపాటు ఇతర నేతలకు నోటీసులు పంపించినట్లు తెలిపారు.టీఎంసీ ఎమ్మెల్యేలు, ఎంపీలు పార్టీని వీడటంతో పార్టీలో మమతా బెనర్జీ పలు కీలక మార్పులు చేసినట్లు తృణముల్ వర్గాలు వెల్లడించాయి. టీఎంసీ యూత్ ప్రెసిడెంట్‌గా నియమించిన వారం రోజులకే సయోని ఘోష్ ఎన్డీఏకు మద్దతు ఇస్తున్నట్లు ఆమె ప్రకటించడంతో ఆ స్థానాన్ని దీదీ భర్తీ చేశారు. సయోని ఘోష్ స్థానంలో టీఎంసీ నేత అర్నబ్ బెనర్జీని యూత్ విభాగం అధ్యక్షుడిగా నియమించినట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. టీఎంసీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కోల్‌కతా దక్షిణ ఎంపీ మాలా రాయ్ స్థానంలో కలిగంజ్ టీఎంసీ ఎమ్మెల్యే అలీఫా అహ్మద్‌ను మార్చినట్లు పేర్కొన్నాయి.

# వర్షం వస్తే నేనే రోడ్డుపైకి వస్తా

ట్రాఫిక్ జామ్ అయితే ఇకపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్ విభాగంలోని ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని డీజీపీకి సూచించారు. మానవ తప్పిదాల వల్ల సమస్యలు తలెత్తితే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించనని హెచ్చరించారు. వర్షాల సమయంలో ఏర్పడే వాటర్ లాగింగ్ పాయింట్లు, బ్లాక్ స్పాట్లు, ట్రాఫిక్ జామ్ అయ్యే ప్రాంతాల డేటా ఆధారంగా అధికారులు సన్నద్ధం కావాలని సూచించారు.వర్షం కారణంగా పలు చోట్ల చెట్లు కూలిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ పునరుద్ధరణ వెంటనే జరగాలని సూచించారు. అవసరమైన చోట్ల మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. వర్షం సమయంలో విద్యుత్ శాఖ సిబ్బంది అంతా క్షేత్రస్థాయిలో పనిచేసేలా చూడాలని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల వద్ద పటిష్ట చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇరిగేషన్ అధికారులకు సూచించారు. మాన్యువల్ ప్రకారం ప్రాజెక్టుల నిర్వహణ ఉండాలన్నారు. వర్షాకాలంలో ప్రాజెక్టుల వద్ద సంబంధిత ఇంజినీర్లు తప్పనిసరిగా స్థానికంగా ఉండాలని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ప్రాజెక్టులను వదిలి వెళ్లే ఇంజినీర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ కార్యదర్శిని ఆదేశించారు.ప్రాజెక్టుల గేట్ల మరమ్మతులు, నిర్వహణకు అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేయాలని ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాకు సూచించారు.వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని ముఖ్యమంత్రి సూచించారు. ముఖ్యంగా విత్తనాలు, యూరియా పంపిణీపై దృష్టి సారించాలన్నారు. రైతు వేదికల ద్వారా యూరియా పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. యూరియా స్టాక్ , పంపణి కోసం స్థానిక వ్యవసాయ అధికారిని బాధ్యుడిగా నియమించడంతో పాటు రెవెన్యూ సిబ్బందిని కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. సన్న వడ్ల కోసం వ్యవసాయ శాఖ ప్రకటించిన ఎనిమిది రకాల విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.వర్షాల కారణంగా తాగునీరు కలుషితం కాకుండా చూడాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. గతంలో తాగునీటి కాలుషితం కారణంగా జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు నీటి పరీక్షలు నిర్వహించాలని జలమండలి అధికారులను ఆదేశించారు.నీటి కలుషితం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున వైద్య ఆరోగ్య శాఖ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన మందులను సిద్ధం చేసుకోవాలన్నారు. వర్షాల కారణంగా నీటి నిల్వలు ఏర్పడి అపరిశుభ్ర వాతావరణం ఏర్పడే అవకాశం ఉన్నందున శానిటేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, జలమండలి, వైద్య ఆరోగ్య శాఖలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్‌కు ముఖ్యమంత్రి సూచించారు. పోలీసు, ట్రాఫిక్, ఫైర్, హైడ్రా, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సంస్థలతో సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను ఆదేశించారు.

# ఢిల్లీ వేదికగా జనసేన బిగ్ స్కెచ్



ఆకాంక్షలకు, దేశ సార్వభౌమాధికారానికి మధ్య ఉండాల్సిన సమతుల్యతను ఈ సమావేశంలో ప్రముఖంగా చర్చించనున్నారు.

### దక్షిణాది రాష్ట్రాల ప్రతినిధులతో భారీ క్యాన్వాస్

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకే పరిమితం కాకుండా కర్ణాటక, తమిళనాడు, కేరళ వంటి ఇతర దక్షిణాది రాష్ట్రాల నుంచి ఇటీవల కాలంలో పార్టీలో చేరిన ముఖ్యులను ఈ సమావేశానికి ప్రత్యేకంగా ఆహ్వానించడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నామినేట్ అయిన కార్పొరేషన్ ఛైర్మన్లతో పాటు, వివిధ రాష్ట్రాల ముఖ్య నేతలు ఈ మేధోమథనంలో భాగస్వాములు కానున్నారు. దీని ద్వారా దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీ భావజాలాన్ని మరింత బలంగా విస్తరించే వ్యూహం కనిపిస్తోంది.

### జాతీయ రాజకీయాలపై దిశానిర్దేశం

ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో దేశవ్యాప్తంగా సమైక్యతగా నిలవాల్సిన ఆవశ్యకతను నాయకులకు వివరించడంతో పాటు, భవిష్యత్ జాతీయ రాజకీయాల్లో జనసేన పోషించబోయే పాత్రపై పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేయనున్నారు. ప్రాంతీయ సమస్యల పరిష్కారానికి జాతీయ వేదికలను ఎలా ఉపయోగించుకోవాలనే అంశంపై ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించనున్నారు. ఉదయం ప్రారంభమై సాయంత్రం వరకు సాగనున్న ఈ సుదీర్ఘ సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లను పార్టీ ఉన్నత శ్రేణి నాయకత్వం ఇప్పటికే ఢిల్లీలో ఉండి పర్యవేక్షిస్తోంది. కేవలం ఎన్నికల విజయాలకే పరిమితం కాకుండా, ఒక స్పష్టమైన జాతీయ దృక్పథంతో ముందుకు సాగాలనే జనసేన ఆలోచనకు ఈ ఢిల్లీ పర్యటన ఒక మైలురాయిగా నిలవనుంది.

# హైదరాబాద్‌లో 'కాక్రోచ్' నిరసన

## – ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** దేశ విద్యా రంగాన్ని కుదిపేస్తున్న నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన దేశవ్యాప్త నిరసన జ్వాలలు భాగ్యనగరానికి తాకాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలనే ప్రధాన డిమాండ్‌తో హైదరాబాద్‌లోని ధర్నా చౌక్ వేదికగా సీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం భారీ బహిరంగ నిరసన ప్రదర్శన జరిగింది. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న పాలకుల తీరుకు వ్యతిరేకంగా తరలివచ్చిన ఆందోళనకారులతో ఇందిరా పార్క్ పరిసరాలు జనసంద్రంగా మారాయి. "ధర్మేంద్ర ప్రధాన్ ఇస్తీఫా దో", "గోడీ మీడియా హై హై" అంటూ నినాదాలతో ధర్నా చౌక్ మార్మోగింది. ఈ మహాధర్నాకు ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్, ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ రావు, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి హాజరై తమ మద్దతు ప్రకటించారు.

### లాల్ బహదూర్ శాస్త్రి నైతికత ఏది?

ఈ నిరసన సభను ఉద్దేశించి ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ రావు మాట్లాడుతూ.. విద్యావ్యవస్థలో ఇంత పెద్ద కుంభకోణం జరిగినా కేంద్ర మంత్రి పదవిలో కొనసాగడం సిగ్గుచేటన్నారు. గతంలో ఒక రైలు ప్రమాదం జరిగినప్పుడు నైతిక బాధ్యత వహిస్తూ నాటి రైల్వే మంత్రి లాల్ బహదూర్ శాస్త్రి తన పదవికి రాజీనామా చేసిన చారిత్రాత్మక ఉదాహరణను ఆయన గుర్తుచేశారు. నేటి పాలకులు కనీస నైతిక బాధ్యత లేకుండా విద్యార్థుల జీవితాలను బలిపీఠం ఎక్కిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు అధ్వాన్నంగా మారడం వల్లే పేదలు ప్రైవేట్ సంస్థల వైపు వెళ్లాల్సి వస్తోందని సభలో పాల్గొన్న పలువురు వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యావ్యవస్థలో వేళ్లూనుకున్న కులతత్వానికి రోహిత్ వేముల లాంటి ఎందరో మేధావులు బలిపశువులవుతున్నారని సీజేపీప్రతినిధి విజేత దహియా మండిపడ్డారు.

### కలచివేసిన యదార్థ గాథలు!

ఈ లీకేజీల వల్ల పేద కుటుంబాల ఆశలు ఎలా సమాధి అవుతున్నాయో వివరిస్తూ ఆకాంక్ష చతుర్వేది, ప్రదీప్ అనే విద్యార్థుల ఉదంతాలను సభలో ప్రస్తావించారు. డాక్టర్ చదివి కుటుంబ కష్టాలు తీరుస్తానని.. తండ్రి తెచ్చిన మూడు లక్షల అప్పు తీరుస్తానని నమ్మకంగా ఉన్న ఆకాంక్ష, పేపర్ లీక్ వార్తలతో మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడిన ఉదంతం కన్నీళ్లు పెట్టించింది. చనిపోయిన కొడుకు కెమిస్ట్రీ పుస్తకాన్ని గుండెలకు హత్తుకుని నేటికీ రోదిస్తున్న ఒక పేద తండ్రి వేదనను సభ ముందు ఉంచారు. "అసమర్థులు, చదువురాని వారు ఉన్నత స్థానాల్లో కూర్చుంటే సమాజానికి ముప్పు వాటిల్లుతుంది. ఈ అబద్ధాల నెట్‌వర్క్‌ను ఛేదించేందుకే ఈ కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమం పుట్టింది" అని నేతలు స్పష్టం చేశారు.

### ఇది కేవలం పార్టీ కాదు.. ప్రజలను మేల్కొలిపే సైన్యం: సోనమ్ వాంగ్‌చుక్

ధర్నా చౌక్‌కు చేరుకున్న ప్రముఖ పర్యావరణవేత్త, రామన్ మెగసేసే అవార్డు గ్రహీత సోనమ్ వాంగ్‌చుక్‌కు నిరసనకారులు "సోనమ్ సర్ తుంకో లాల్ సలామ్" అంటూ ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాక్రోచ్ జనతా పార్టీ కేవలం ఒక రాజకీయ వేదిక కాదని, ప్రతి భారతీయుడిని నిద్రలేపే ఒక చైతన్య ఉద్యమమని అభివర్ణించారు. దేశ ప్రధానితో సహా ప్రతీ ఒక్కరినీ జవాబుదారీగా చేసే విద్యా సంస్కరణలు రావాలన్నారు. స్వేచ్ఛగా మాట్లాడే హక్కు లేనప్పుడు అది ప్రజాస్వామ్యమే కాదని, సింగపూర్ లాంటి దేశాలు గతాన్ని మర్చిపోయి సామరస్యంతో ఎలా ఎదిగాయో భారత్ కూడా ద్వేషాన్ని వీడి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

### కాంక్రీట్ జంగిల్ అభివృద్ధి కాదు.. పర్యావరణ పరిరక్షణే ముఖ్యం

ఈ నిరసన వేదిక ద్వారా కేవలం విద్యపైనే కాకుండా పర్యావరణ హననంపై కూడా సీజేపీ గళమెత్తింది. నగరాలను కాంక్రీట్ వనంగా మార్చడం అందం కాదని, చెట్లను నరుకుతూ చేసే అభివృద్ధి వినాశనానికి దారితీస్తుందని ప్రతినిధులు హెచ్చరించారు. హైదరాబాద్‌లోని కేబీఆర్ నేషనల్ పార్క్ పరిరక్షణ కోసం ఇక్కడి ప్రజలు చేస్తున్న పోరాటాన్ని సోనమ్ వాంగ్‌చుక్ అభినందించారు. దేశంలో భయానక వాతావరణాన్ని వీడి, పారదర్శకమైన విద్యావ్యవస్థ, స్వచ్ఛమైన గాలి, నీరు ఉన్న నవభారతాన్ని నిర్మించేందుకు యువత కదలిరావాలని పిలుపునిచ్చింది కాక్రోచ్ జనతా పార్టీ.

# ఖండఖండాలుగా విడిపోతున్న మేఘాలు

## – బంగాళాఖాతంలో ద్రోణి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు శరవేగంగా విస్తరిస్తున్నాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఆదివారం విడుదల చేసిన నివేదిక ప్రకారం నైరుతి రుతుపవనాల ఉత్తర పరిమితి ప్రస్తుతం హర్నై, సోలాపూర్ మీదుగా తెలంగాణలోని హైదరాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, అటుపై కళింగపట్నం, పారాదీప్, ముజఫర్‌పూర్ మీదుగా కొనసాగుతోంది. రాబోయే 4 నుంచి 5 రోజులలో తెలంగాణలోని మిగిలిన ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, జార్ఖండ్, బీహార్, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లోని మరికొన్ని ప్రాంతాలకు రుతుపవనాలు మరింత ముందుకు సాగడానికి పరిస్థితులు పూర్తిగా అనుకూలంగా ఉన్నాయని అధికారులు వెల్లడించారు.

### బంగాళాఖాతంలో ద్రోణి.. బలహీనపడిన ఆవర్తనం

ప్రస్తుతం వాతావరణ పరిస్థితులను పరిశీలిస్తే.. దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్‌కు ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతం నుంచి నైరుతి బంగాళాఖాతం మీదుగా దక్షిణ తమిళనాడు వరకు, సముద్ర మట్టానికి 3.1 నుంచి 4.5 కిలోమీటర్ల ఎత్తు మధ్య ఒక ద్రోణి విస్తరించి ఉంది. దీని ప్రభావంతో రాష్ట్రంలోకి తగినంత తేమ గాలులు వీస్తున్నాయి. మరోవైపు, దక్షిణ తెలంగాణ పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం క్రమంగా బలహీనపడినట్లు వాతావరణ కేంద్రం విశ్లేషించింది.

### రాగల 3 రోజుల వాతావరణ సూచన

ఈ వాతావరణ మార్పుల నేపథ్యంలో తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు వాతావరణం చల్లబడనుంది. ఆదివారం నుండి 3 రోజులు రాష్ట్రంలోని పలు జిల్లాలలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక ఉష్ణోగ్రతల విషయానికి వస్తే.. రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలలో రానున్న మూడు రోజులలో పెద్దగా మార్పులు ఏమీ ఉండవని, ఎండల తీవ్రత తగ్గి సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని పేర్కొన్నారు.

### వాతావరణ హెచ్చరికలు: గంటకు 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు

వర్ష సూచనతో పాటు వాతావరణ కేంద్రం రాష్ట్ర ప్రజలకు పలు హెచ్చరికలు జారీ చేసింది. ఈ మూడు రోజులు రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. వాతావరణం ఒక్కసారిగా మారి, వర్షం పడే సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని సంచాలకులు హెచ్చరించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, ప్రయాణికులు ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్ద ఆశ్రయం పొందకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# భారత్ ఇన్నోవేట్స్

## ప్రారంభించిన మోదీ, మేక్రాన్

### – దేశంలో స్టార్టప్ వ్యవస్థ మరింత విస్తరిస్తుందన్న మోదీ



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రధాని నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఆదివారం ఫ్రాన్స్‌లోని నీస్ నగరంలో ఉన్న చారిత్రక 'విల్లా కెర్లియోస్'ను సందర్శించారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలు తేలికపాటి సంభాషణలో మునిగిపోయారు. విల్లాను కలియతిరుగుతూ ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. విల్లా కెరిలోస్ అనేది 20వ శతాబ్దం ప్రారంభంలో నిర్మించిన ఒక అసాధారణమైన హౌస్ మ్యూజియం. క్రీస్తుపూర్వం 2వ శతాబ్దానికి చెందిన ఒక ప్రాచీన గ్రీకు ఉన్నత కుటుంబ నివాసాన్ని నమూనాగా తీసుకుని, ఎంతో నిశితంగా ఆధునిక కాలంలో దీన్ని పునఃసృష్టించారు. ఫ్రాన్స్‌లోని ఫ్రెంచ్ రివేరా తీరంలో, నైస్ మరియు మొనాకో నగరాల మధ్య ఉన్న బ్యూలీ–సర్–మెర్ అనే ప్రాంతంలో ఈ విల్లా ఉంది. మధ్యధరా సముద్రానికి అభిముఖంగా ఒక రాతి ద్వీపకల్పంపై కొలువై ఉన్న ఈ భవనం, ప్రస్తుతం చారిత్రక కట్టడంగా వర్గీకరించబడింది. దీని యాజమాన్య హక్కులను 'ఇన్‌స్టిట్యూట్ డి ఫ్రాన్స్' కలిగి ఉంది. అంతకుముందు, నీస్‌లో జరిగిన 'భారత్ ఇన్నోవేట్స్' కార్యక్రమాన్ని మోదీ, మేక్రాన్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. భారత్‌లో సంస్కరణల వేగం తగ్గబోదని స్పష్టం చేశారు. దేశంలోని స్టార్టప్ వ్యవస్థ మరింత విస్తరణకు సిద్ధంగా ఉందన్నారు. గత 11–12 ఏళ్లలో బలమైన ఆవిష్కరణల వ్యవస్థను నిర్మించుకున్నామని, ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా భారత్ అవతరించిందని గుర్తు చేశారు. ప్రపంచ సవాళ్లకు సాంకేతిక పరిష్కారాలు అభివృద్ధి చేసేందుకు తమతో కలిసి పనిచేయాలని ప్రపంచ ఆవిష్కర్తలను ఆయన ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరుకావడం ఫ్రాన్స్‌కు ఎంతో గౌరవకారణమని అధ్యక్షుడు మేక్రాన్ అన్నారు. భారత నేతగా 12 ఏళ్లు పూర్తి చేసుకున్నందుకు మోదీని అభినందించారు. ఇరు దేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడంలో మోదీ పాత్రను ఆయన ప్రశంసించారు. అధ్యక్షుడు మేక్రాన్ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ శనివారం ఫ్రాన్స్ చేరుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఇరు నేతలు ద్వైపాక్షిక సంబంధాలపై సమీక్ష జరపనున్నారు. ఈ కార్యక్రమానికి ముందు మోదీ పలువురు ఇన్వెస్టర్లు, వెంచర్ క్యాపిటల్ అధిపతులతో కూడా సమావేశమయ్యారు.

# మీనాక్షి నటరాజన్‌కు వెన్నుపోటు పొడిచింది రేవంత్ రెడ్డే

- కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని విమర్శలు
- ఖైరతాబాద్‌లో ఉపఎన్నిక రావడం ఖాయమని జోస్యం
- ఓటర్ల జాబితాపై అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులకు పిలుపు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. సొంత పార్టీ నేత, రాహుల్ గాంధీకి సన్నిహితురాలైన మీనాక్షి నటరాజన్‌కు రేవంత్ రెడ్డి వెన్నుపోటు పొడిచారని, ఆమెపై తప్పుడు కేసు బనాయించి వేధించారని విమర్శించారు. ఆమెకు మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ సీటు రాకుండా అడ్డుకునేందుకు బీజేపీతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. ఆదివారం ఖైరతాబాద్ నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. రేవంత్ రెడ్డి అవినీతి, భూ ఒప్పందాలపై మీనాక్షి నటరాజన్ కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారని, దీనికి ప్రతీకారంగానే హైదరాబాద్‌లో ఆమెపై తప్పుడు కేసు పెట్టించారని అన్నారు. సొంత పార్టీ నేతలనే వెన్నుపోటు పొడిచే నైజం రేవంత్ రెడ్డిదని ఆయన దుయ్యబట్టారు. హిట్లర్ తన ఆదర్శం అని సీఎం చెప్పడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ పాలనను 'అట్టర్ ఫ్లాప్ సినిమా'గా అభివర్ణించిన కేటీఆర్, ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని అన్నారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాల హామీ ఏమైందని, కనీసం 4,000 ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని ప్రశ్నించారు. రూ.4,000 నిరుద్యోగ భృతి హామీని కూడా విస్మరించారని మండిపడ్డారు. కోటి మంది మహిళలను లక్షాధికారులను చేశామని నిరూపిస్తే తాను రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. ఖైరతాబాద్‌లో ఉపఎన్నిక రావడం ఖాయమని కేటీఆర్ జోస్యం చెప్పారు. ప్రజాతీర్పును ధిక్కరించి దానం నాగేందర్ కాంగ్రెస్‌లోకి ఫిరాయించడమే దీనికి కారణమని స్పష్టం చేశారు. జూన్ 25 నుంచి జరిగే ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనాలని, డిజిటల్ సభ్యత్వ నమోదును రికార్డు స్థాయిలో చేపట్టాలని పార్టీ శ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

# పల్నాడు పడవ ప్రమాదంపై చంద్రబాబు దిగ్భ్రాంతి

## - రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటన



**అమరావతి (ప్రశ్న న్యూస్)** పల్నాడు జిల్లా కోనూరు సమీపంలో కృష్ణా నదిలో పడవ బోల్తా పడి నలుగురు మృతి చెందిన ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రస్తుతం సింగపూర్ పర్యటనలో ఉన్న ఆయన, ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే అక్కడి నుంచే పల్నాడు జిల్లా కలెక్టర్ సహా ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా అత్యవసర సమీక్ష నిర్వహించారు. ప్రమాద వివరాలు, సహాయక చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. నదిలో మునిగి ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటిస్తున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఈ మొత్తాన్ని తక్షణమే బాధిత కుటుంబాలకు అందజేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు.

### ప్రమాదంపై విచారణకు సీఎం చంద్రబాబు ఆదేశాలు

ఈ పడవ ప్రమాదంపై రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ శాఖల అధికారుల బృందంతో పూర్తి స్థాయి విచారణ జరిపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర నివేదిక సమర్పించడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి దారుణ ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన నివారణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ ఘటనపై తదుపరి తనిఖీలు, సహాయక చర్యల సమన్వయం కోసం విపత్తు నిర్వహణ సంస్థ అధికారి ప్రఖర్ జైన్, సమాచార పౌరసంబంధాల విభాగం డైరెక్టర్ విశ్వనాథ్, పల్నాడు జిల్లా కలెక్టర్లకు సీఎం ప్రత్యేక బాధ్యతలను అప్పగించారు.ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఈ పడవ ప్రమాదం జరిగింది. కృష్ణా నదిలో ప్రయాణిస్తున్న పడవ అకస్మాత్తుగా ఒక ఇసుక దిబ్బను బలంగా ఢీకొట్టడంతో ఒక్కసారిగా నియంత్రణ కోల్పోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గంధం శైను, గంధం సంధ్య, బత్తుల కార్తీక్, కాంతం చైతన్యలు నీటిలో మునిగి చనిపోయినట్లు అధికారులు సీఎం చంద్రబాబుకు వివరించారు. పడవలో ఉన్న మిగిలిన ఆరుగురు వ్యక్తులను సురక్షితంగా కాపాడినట్లు తెలిపారు. నది నుంచి వెలికితీసిన నలుగురి మృతదేహాలను ఏరియా ఆసుపత్రికి తరలించామని, పోస్టుమార్టం ప్రక్రియ ముగిసిన వెంటనే వారి బంధువులకు అప్పగిస్తామని అధికారులు ముఖ్యమంత్రికి నివేదించారు.

### అసలేం జరిగిందంటే..

పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలోని అచ్చంపేట మండలం కోనూరులో ఆదివారం విషాదం చోటుచేసుకుంది. బంధువుల ఇంట్లో జరిగిన ఒక వేడుకకు హాజరైన ఒకే కుటుంబానికి చెందిన నలుగురు చిన్నారులు/యువకులు కృష్ణా నదిలో జరిగిన పడవ ప్రమాదంలో మృతిచెందారు. ఈ సంఘటన కోనూరు గ్రామంలో విషాదాన్ని నింపింది. శుభకార్యానికి వచ్చి, సరదాగా పడవ షికారుకు వెళ్లిన పిల్లలు ఇలా విగతజీవులుగా తిరిగిరావడంతో ఆ కుటుంబంలో గుండెలవిసేలా రోదనలు మిన్నంటాయి.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోనూరు గ్రామానికి చెందిన కుంకులగుంట గంగయ్య కొడుకు పిల్లలు ఇద్దరు, అలాగే ఆయన కూతురు పిల్లలు ఇద్దరు ఒకేసారి ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. మృతులను చైతన్య (20), కార్తిక్ (13), సైనీ (11), సంధ్య (9)గా పోలీసులు నిర్ధారించారు. కళ్లముందే నలుగురు పిల్లలు నదిలో మునిగిపోవడంతో ఆ కుటుంబ సభ్యులు షాక్‌కు గురయ్యారు. మరణించిన వారిలో ఇద్దరు స్థానిక కోనూరు గ్రామానికి చెందినవారు కాగా, మరొకరు మరిశెట్టిపాలెం, ఇంకొకరు చిలకలూరిపేటకు చెందినవారిగా బంధువులు గుర్తించారు.ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే అచ్చంపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. నదిలో నుంచి మృతదేహాలను వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అచ్చంపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఈ ఘోర ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. పడవ ప్రమాదానికి గల కారణాలు, సామర్థ్యానికి మించి ప్రయాణించారా లేదా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# స్వచ్ఛంద రక్తదాన సేవలకు గుర్తింపు..

## డా. రాజేశ్వర్ రావుకు గవర్నర్ సత్కారం



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) రక్తదానం పట్ల సమాజంలో చైతన్యం కలిగిస్తూ, స్వచ్ఛంద రక్తదానాన్ని ప్రోత్సహిస్తూ విశిష్ట సేవలందించిన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రెడ్ క్రాస్ శాఖ చైర్మన్, ప్రొహిబిషన్,ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఓఎస్డీ డా. ఎస్.ఎం. రాజేశ్వర్ రావును తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సత్కరించి పురస్కారాలు అందజేశారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా లోక్ భవన్‌లోని సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో భారత రెడ్‌క్రాస్ సొసైటీ, తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని గవర్నర్ ప్రారంభించారు.

అనంతరం విశిష్ట సేవలందించిన వైద్యులు, అత్యధిక సార్లు రక్తదానం చేసిన దాతలు, రక్తదాన శిబిరాల నిర్వాహకులు, అలాగే కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద భారత రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ శాఖకు విశేష సహకారం అందించిన సంస్థల ప్రతినిధులను గవర్నర్ సత్కరించి పురస్కారాలు అందజేశారు. స్వచ్ఛంద రక్తదానోద్యమంలో ప్రజలను భాగస్వాములను చేయడంలో, అవగాహన కల్పించడంలో డా. రాజేశ్వర్ రావు చేస్తున్న కృషికి గాను, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ శాఖ ఆయనను "హయ్యెస్ట్ బ్లడ్ డోనర్ మోటివేటర్ అవార్డు-2026"కు ఎంపిక చేసింది. ఈ సందర్భంగా గవర్నర్ చేతుల మీదుగా ఆయన అవార్డును స్వీకరించారు.డా. రాజేశ్వర్ రావు నాయకత్వంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రెడ్ క్రాస్ శాఖ చేపట్టిన సేవా కార్యక్రమాలు పలువురి ప్రశంసలు అందుకుంటున్నాయి. 2023 మార్చి నుంచి 2026 మే వరకు 113 రక్తదాన శిబిరాలను నిర్వహించి 8,279 యూనిట్ల రక్తాన్ని సేకరించగా, ఆ రక్తం తలసేమియా, క్యాన్సర్ రోగులకు ఎంతో ఉపయోగపడింది.

అలాగే 467 ఉచిత వైద్య శిబిరాల ద్వారా 24,142 మందికి పైగా వృద్ధులు, దివ్యాంగులు, గిరిజన ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందించారు. అత్యవసర సమయాల్లో ప్రాణాలను కాపాడేందుకు 20 సీపీఆర్, ఫస్ట్ ఎయిడ్ శిక్షణ కార్యక్రమాల ద్వారా 1,865 మందికి శిక్షణ కల్పించారు. శామీర్‌పేటలో వృద్ధుల కోసం 'ప్రణామ్' డే కేర్ సెంటర్, బోయిన్‌పల్లిలో మిస్రీలాల్ మంగీలాల్ మాతా-శిశు ఆసుపత్రిని నిర్వహిస్తూ పేద కుటుంబాలకు ఆరోగ్య సేవలు అందుబాటులోకి తెచ్చారు. వీటితో పాటు టీబీ ముక్త్ అభియాన్, ఆయుష్మాన్ భారత్ పథకం నమోదు, వరద బాధితులకు సహాయక చర్యలు, యువ రెడ్ క్రాస్ వంటి అనేక సామాజిక సేవా కార్యక్రమాలను ఆయన సమర్థవంతంగా అమలు చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్, శాంతిభద్రతల విభాగం డైరెక్టర్ జనరల్ మహేష్ భగవత్, హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ శాఖ ప్రధాన కార్యదర్శి, సీఈఓ ప్రొఫెసర్ శ్రీరాములు, ట్రెజరర్ శ్రీనివాస్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి శశికిరణాచారి, లార్వెన్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ వరుణ్ విహార్, సీఈఓ రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సేవాభావానికి..ప్రతిరూపం ఆర్య వైశ్యులు

**ఐక్యతలో ప్రత్యేకత చాటుకున్న జిల్లా ఆర్య వైశ్యులు**

**సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలి**

**ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) సేవకు ఆర్యవైశ్యులు ప్రతిరూపంగా నిలుస్తుండగా, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఆర్య వైశ్యులు ఎదగాలని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ గుప్త ఆకాంక్షించారు. ఆదివారం గజ్వేల్ పట్టణ శివారులోని కమలం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఐక్యతకు నిదర్శనంగా నిలిచిన సిద్దిపేట ఆర్యవైశ్యులు మహాసభ ఎన్నికల్లో తనకు సంపూర్ణ సహకారం అందించినట్లు గుర్తు చేశారు. పేద ఆర్యవైశ్యులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం ఉంటుందని, అయితే కార్యవర్గ సమావేశాల్లో ఈ అంశాలకు ప్రాధాన్యత ఇచ్చి నివేదిక సమర్పించాలని కోరారు. రాష్ట్రంలో ఆర్యవైశ్యులు ఎదుర్కొంటున్న వివిధ ఇబ్బందులను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి ఇప్పటికే తీసుకురాగా, ఆయన పూర్తి సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ స్థాయిలో ఉన్న ఆర్యవైశ్య ప్రజాప్రతినిధులు, ప్రతిభ చాటిన ఉత్తమ విద్యార్థులను ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు ఆంజనేయులు గుప్త అధ్యక్షత వహించగా, కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి గుప్త, మహాసభ జిల్లా మాజీ అధ్యక్షులు కాచం నవీన్ గుప్త, రాష్ట్ర, జిల్లా నేతలు గంప శ్రీనివాస్ గుప్త, సముద్రాల హరినాథ్ గుప్త, చంద్రశేఖర్ గుప్త, సత్యనారాయణ గుప్త, సిద్ధి బిక్షపతి గుప్త, మహంకాళి శ్రీనివాస్ గుప్త, అత్తెల్లి శ్రీనివాస్ గుప్త, తోట శ్రీనివాస్ గుప్త, కైలాస ప్రభాకర్ గుప్త, తడక లింగమూర్తి గుప్త, జూలూరి రంగయ్య గుప్త, వెంకటయ్య గుప్త, బుద్ధ సత్యం గుప్త, దొంతుల సత్యనారాయణ గుప్త తదితరులు పాల్గొన్నారు.

## చదువులో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని అక్షరకు ఘన సత్కారం



గజ్వేల్ (ప్రశ్న న్యూస్ ) గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డుకు చెందిన విద్యార్థిని చెప్యాల అక్షర ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించడం పట్ల పద్మశాలి సేవా సంఘం గజ్వేల్ -ప్రజ్ఞాపూర్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అక్షరకు శాలువా కప్పి అవార్డు ప్రదానం చేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు బొల్లిబత్తుల దేవదాసు మాట్లాడుతూ, పద్మశాలి సమాజానికి చెందిన విద్యార్థిని అక్షర గజ్వేల్ నుంచి రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించడం గర్వకారణమని అన్నారు. "నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు" అని పేర్కొంటూ, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.పద్మశాలి సమాజంలో అనేక మంది ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు ఉన్నాయని, చదువును మధ్యలో ఆపకుండా కొనసాగించేందుకు అవసరమైన ఆర్థిక సహాయం, పుస్తకాలు, మార్గదర్శకత్వం వంటి సహకారాన్ని సంఘం తరఫున అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కోట కిషోర్, ప్రధాన కార్యదర్శి గాడిపల్లి ఎల్లంరాజు, సంయుక్త కార్యదర్శి పాషికంటి శ్రీనివాస్, జిల్లా పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు గాడిపల్లి అనూప్, ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి దేవసాని వాసుదేవ్, యువజన సంఘం అధ్యక్షులు తలకొక్కుల ప్రేమ్ కుమార్, ఉపాధ్యక్షులు నర్సింలు, ప్రధాన కార్యదర్శి నాగరాజు, అలాగే దేవసాని రవి, దేవసాని పోశెట్టి, దేవసాని సుధాకర్, దయానంద్, నాగభూషణం, వేణు, భాస్కర్, మల్లేశం, ఏడెల్లి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.పద్మశాలి కుల పెద్దలు, యువజన నాయకులు, సంఘ సభ్యులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## యాదగిరిగుట్టలో రోడ్డు ప్రమాదం.. ఒకరి మృతి



యాదాద్రి భువనగిరి : యాదగిరిగుట్ట లో స్వామివారిని దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణమైన భక్తుల వాహనం బోల్తా పడి ఒకరు మృతి చెందారు. యాదగిరిపల్లి వద్ద టాటా ఏస్ వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి పడిపోయింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. మిగతావారికి స్వల్ప గాయాలయ్యాయి.గాయపడినవారిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదు. పోలీసులకు సమాచారం అందడంతో అక్కడికి చేరుకుని పంచనామా చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

## లండన్‌లో భారత సంతతి యువకుడి దారుణ హత్య..!




జతీఅఎవ చీవఎం : లండన్ లో భారత సంతతి యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. పశ్చిమ లండన్ (ఔవర్ London) లోని సౌత్‌హాల్ ప్రాంతంలో పంజాబ్ కు చెందిన 26 ఏళ్ల గుర్భేజ్ సింగ్ ను దుండగులు కత్తితో పొడిచి చంపారు. ఈ విషయాన్ని మెట్రోపాలిటన్ పోలీసులు శనివారం అధికారికంగా వెల్లడించారు. ఈ ఘటనతో లండన్‌లోని భారత సమాజంలో ఆందోళన వ్యక్తమవుతోంది. బుధవారం అర్ధరాత్రి దాదాపు 12:30 గంటలకు నార్త్ రోడ్‌లోని డోర్మర్స్ వెల్స్ లేన్ జంక్షన్ వద్ద ఈ దాడి జరిగింది. కత్తిపోట్లపై సమాచారం అందుకున్న లండన్ అంబులెన్స్ సర్వీస్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు.పోలీసులు, పారామెడికల్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకునేసరికి ఇద్దరు వ్యక్తులు గాయాలతో పడి ఉన్నారు. తీవ్ర గాయాలపాలైన గుర్భేజ్ సింగ్‌ను రక్షించేందుకు వైద్యులు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. దాంతో అతడు మరణించినట్లు ప్రకటించారు. ఈ ఘటనలో గాయపడిన 30 ఏళ్ల మరో వ్యక్తిని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స అనంతరం అతడు డిశ్చార్జ్ అయ్యాడు. ఈ హత్యకు సంబంధించి పోలీసులు ఘటనా స్థలంలోనే 20 నుంచి 30 ఏళ్ల మధ్య వయసున్న ఏడుగురు వ్యక్తులను అనుమానంపై అరెస్ట్ చేశారు.లోతైన విచారణ అనంతరం ఆరుగురిని ఎలాంటి తదుపరి చర్యలు లేకుండా విడుదల చేయగా.. ఒక వ్యక్తికి బెయిల్ మంజూరు చేశారు. మెట్ స్పెషలిస్ట్ క్రైమ్ కమాండ్ డిటెక్టివ్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ అలిసన్ ఫాక్స్‌వెల్ మాట్లాడుతూ.. 'గుర్భేజ్ సింగ్ హత్యపై దర్యాప్తు కొనసాగుతోంది. ఆయన కుటుంబానికి మా ప్రగాఢ సానుభూతి. దాడి జరిగిన ప్రాంతంలో సీసీటీవీ ఫుటేజ్ ఉన్నవారు లేదా ఘటనను చూసినవారు ఎవరైనా ఉంటే దయచేసి మమ్మల్ని సంప్రదించాలి' అని విజ్ఞప్తి చేశారు.ఈ విషాద ఘటన నేపథ్యంలో గుర్భేజ్ సింగ్ మృతదేహాన్ని స్వదేశానికి తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అంత్యక్రియల ఖర్చుల కోసం అతడి స్నేహితులు, కుటుంబ సభ్యులు 'గోఫండ్‌మీ' ద్వారా నిధుల సేకరణ ప్రారంభించారు. 16,000 యూరోల లక్ష్యంతో ప్రారంభించిన ఈ క్యాంపెయిన్‌లో ఇప్పటివరకు 737 మంది దాతల నుంచి 11,114 యూరోలు సమకూరాయి.

## నీళ్లివ్వలేని ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ నిర్మిస్తుందా? : మాజీమంత్రి తలసాని



హైదరాబాద్ : సిటీలో నీళ్లివ్వలేని ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ నిర్మిస్తారా? ఎంతో గౌరవ ప్రదమైన ముఖ్యమంత్రి స్థానంలో ఉండి రేవంత్ రెడ్డి నీచమైన భాష మాట్లాడుతున్నాడని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో ఖైరతాబాద్ నియోజకవర్గ బీర్ఎస్ పార్టీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 2001లో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటైందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన అన్యాయాలపై పోరాటం జరిపిన పార్టీ బీఆర్ఎస్ అని తెలంగాణను సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్ అన్నారు.పదేండ్లలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి దేశంలోనే ఆదర్శంగా నిలిపారని ప్రశంసించారు. కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారు. రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. ఖైరతాబాద్‌లో అభివృద్ధి బీఆర్ఎస్ హయాంలోనే జరిగిందన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రజా సమస్యలపై పోరాడాలి . త్వరలో జరగనున్న జీహెచ్ఎంసీ ఎన్నికలకు ఇప్పటి నుండే సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.

## పెద్దపల్లి జిల్లాలో దారుణం.. భార్యను గొడ్డలితో నరికి చంపిన భర్త



హైదరాబాద్ : పెద్దపల్లి జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. జీవితాంతం కలిసి ఉంటానని అగ్నిసాక్షిగా పెళ్లి చేసుకున్న భర్తే ఆమె పాలిట కాలయముడయ్యాడు. భార్యను గొడ్డలితో నరికి చంపాడు. ఈ విషాదకర సంఘటన అంతర్గాం మండలం ముర్మూర్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..లక్ష్మి అనే మహిళను తన భర్త కటుంబ కలహాల నేపథ్యంలో హమార్చాడని తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## అంబులెన్స్‌లో ప్రసవం..తల్లి,బిడ్డ క్షేమం



రాయపోల్ : సిద్ధిపేట జిల్లా రాయపోల్ మండలం అనాజీపూర్ గ్రామానికి చెందిన సౌందర్య అనే గర్భిణిని ఆసుపత్రికి తరలిస్తుండగా అంబులెన్స్ ( Ambulance ) లోనే ప్రసవించింది. ఆమెకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్ కి సమాచారం ఇచ్చారు. దౌల్తాబాద్ నుంచి వచ్చిన 108 అంబులెన్స్ సిబ్బంది ఆమెను గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమద్యలో పురిటి నొప్పులు అధికమయ్యాయి. దీంతో అంబులెన్స్ సిబ్బంది ఆమెకు ప్రసవం ( Delivery ) చేశారు. ఆమె ఆడ బిడ్డకి జన్మనిచ్చింది. తల్లి,బిడ్డ ఇద్దరు క్షేమంగా ఉండడంతో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా గర్భిణికి సహాయమందిచిన 108 సిబ్బంది దేవేందర్, నర్సింలుకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## అది ఫేక్ ఆడియో క్లిప్.. టీపీసీసీ షోకాజు నోటీసులపై వివరణ ఇచ్చిన షబ్బీర్ అలీ



టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజు నోటీసులపై మాజీ మంత్రి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ వివరణ ఇచ్చారు. తన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కుట్ర జరుగుతున్నదని.. వైరల్‌గా మారిన ఆడియోలో ఉన్నది తన వీడియో కాదని ఆయన స్పష్టం చేశారు. అది నకిలీ ఆడియో క్లిప్ అని.. ఎవరో కావాలనే సృష్టించిన కల్పితమైన అంశమని తెలిపారు.తనపై వస్తున్న ఆరోపణల్లో నిజం లేదని షబ్బీర్ అలీ తెలిపారు. క్రమశిక్షణ కమిటీ దీనిపై వివరణ కోరడానికి ముందే.. ఈ దుష్ప్రచారంపై పోలీసులకు ఫిర్యాదు చేశానని పేర్కొన్నారు. తనపై అవాస్తవాలు ప్రచారం చేస్తూ.. వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు న్యాయ నిపుణుల సలహాలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సమాజంలో, పార్టీలో తన ప్రతిష్టను దెబ్బతీయడానికి ఒక ప్లాన్‌తోనే ఈ కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలను పార్టీ శ్రేణులు నమ్మవద్దని అన్నారు. కుట్రధారుల వెనుక ఉన్న అసలు సూత్రధారులను త్వరలోనే బయటపెడతానని చెప్పారు.మహేశ్ గౌడ్ తనకు సోదరుడిలాంటి వాడు అని షబ్బీర్ అలీ తెలిపారు. అతని గురించి ఎక్కడా తప్పుడు వ్యాఖ్యలు చేయలేదని పేర్కొన్నారు. కొందరు కావాలనే తమ మధ్య దూరం పెంచేందుకు కుట్రలు పన్నుతున్నారని అన్నారు. 45 ఏళ్లుగా కాంగ్రెస్ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నానని.. పార్టీకి నష్టం కలిగించే పనులు ఏ మాత్రం చేయనని స్పష్టం చేశారు.

## నాకు బహిరంగ క్షమాపణలు చెప్పండి..

### మమతాబెనర్జికి రెబల్ ఎంపీ కుమారుడి లీగల్ నోటీస్



తృణమూల్ కాంగ్రెస్ రెబల్ ఎంపీ కకోలీ ఘోష్ కుమారుడు డాక్టర్ బైద్యనాథ్ ఘోష్ .. బెంగాల్ మాజీ సీఎం మమతాబెనర్జీ కి లీగల్ నోటీసులు పంపారు. టీఎంసీ ఎంపీలు కల్యాణ్ బెనర్జీ , సౌగతా రాయ్ , మహువా మొయిత్రా లకు కూడా నోటీసులు పంపించారు. బరసత్ అసెంబ్లీ స్థానంలో పోటీ చేయడానికి తాను పార్టీ టికెట్ కోరానని టీఎంసీ నేతలు చేసిన ఆరోపణలపై బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నోటీసులకు స్పందించకపోతే పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు.ఈ నెల మొదట్లో జరిగిన ఓ కార్యక్రమంలో మమతాబెనర్జీ మాట్లాడుతూ.. బరసత్ నుంచి ఎమ్మెల్యే టికెట్ కోసం కొంతమంది తనను సంప్రదించారని పేర్కొన్నారు. అయితే పార్టీలోని సీనియర్ నేతలు అందుకు ఒప్పుకోకపోవడంతో వారు చేసిన అభ్యర్థనను తిరస్కరించినట్లు తెలిపారు. ఒకరు ఎంపీ అయినంత మాత్రాన కుటుంబంలోని వారందరూ ఎంపీలు, ఎమ్మెల్యేలు అవ్వాలా అంటూ పరోక్షంగా కకోలీ ఘోష్‌పై విమర్శలు చేశారు. ఈ క్రమంలోనే కకోలి టీఎంసీని వీడడంతో తన కుమారుడికి టికెట్ ఇవ్వనందుకే ఎన్డీఏకు మద్దతిచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఆరోపణలను బైద్యనాథ్ ఘోష్ ఖండించారు.పదవి కోసం తాను ఎప్పుడూ ఆశ పడలేదని బైద్యానాథ్ చెప్పారు. తన కుటుంబ పరువుకు నష్టం కలిగేలా వ్యాఖ్యలు చేసినందుకు మమతతో సహా ఇతర నేతలకు నోటీసులు పంపినట్లు వెల్లడించారు. టీఎంసీ నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలు బయటకు వెళ్లిపోవడంతో నిర్మాణాత్మక పునర్వ్యవస్థీకరణలో భాగంగా మమతా బెనర్జీ పలు మార్పులు చేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. టీఎంసీ యువజన విభాగం అధ్యక్షురాలిగా నియమించిన వారం రోజులకే.. సయోని ఘోష్ ఎన్డీఏకు మద్దతిస్తున్నట్లు తెలపడంతో ఆమె స్థానంలో పార్టీ నేత అర్నబ్ బెనర్జీని యువజన విభాగం అధ్యక్షుడిగా నియమించినట్లు పేర్కొన్నాయి.

## ఉచిత వైద్య శిబిరానికి అనుహస్పందన



తాండూర్ : మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలోని అచ్చలాపూర్ భారతి తీర్థ కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఉచిత న్యూరాలజీ వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. గ్రామానికి చెందిన ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ అభినయకుమార్ గట్టు నేతృత్వంలో వైద్యులు ముద్దు రాఘవ కృష్ణ , సృష్టి వైద్య శిబిరంలో పాల్గొని వివిధ రకాల కార్పోరేట్ స్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహించారు.తాండూర్, బెల్లంపల్లి ప్రాంతాలకు చెందిన పలువురు వివిధ సమస్యలతో శిఖరానికి వచ్చి పరీక్షలను చేసుకున్నారు. సుమారు 250 మందిని పరీక్షించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. అవసరం ఉన్న వారికి మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రులకు రెఫర్ చేశారు. హైదరాబాద్, అహ్మదాబాద్ పట్టణాలలో వైద్య వృత్తి నిర్వహిస్తూ పేరు ప్రఖ్యాతులు ఘటించిన ఈ ముగ్గురు వైద్యులు కూడా అచ్చలాపూర్ వాస్తవ్యులే కావడం గమనార్హం. అచ్చలాపుర్ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు గట్టు విశ్వనాథ్ శర్మ దంపతుల సహకారంతో నిర్వహించిన శిబిరాన్ని స్థానిక మహావేద పాఠశాల ప్రధాన అధ్యాపకుడు దుద్దిల్ల మనోహర్ శర్మ జ్యోతిప్రజ్వాలనచేసి ప్రారంభించగా బ్రాహ్మణ సంఘ ప్రతినిధులతో పాటు స్థానిక సర్పంచ్ మారిశెట్టి స్రవంతి, ఉప సర్పంచ్ గట్టు సంతోష్ కుమార్ వైద్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో యువకులు, స్థానిక బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష

### - మాజీ మంత్రి జగదీష్ రెడ్డి



యాదాద్రి భువనగిరి : తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. ప్రత్యేక ఓటరు జాబితాపై భువనగిరి నియోజకవర్గ స్థాయి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఆదివారం జరిగింది ఈ సమావేశంలో మాజీ మంత్రి మాట్లాడుతూ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. తెలంగాణ సాధకుడిగా, పదేళ్ల పాటు సీఎంగా రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేసిన కేసీఆర్ గొప్పదనం ప్రజలందరికీ అర్థమయిందని అన్నారు. ఓటర్ జాబితా సవరణ అనేది ఓట్ల వడబోత కార్యక్రమమని, బీఆర్ఎస్ బూత్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తోంది. రైతులు అడుగడుగునా మోసపోయారు. ఇప్పటికీ యాదాద్రి జిల్లా లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి కాలేదు.తడిసి మొలకలు వస్తున్నాయని ఆందోలన వ్యక్తం చేశారు.

### హ్యాం రోడ్ల పేరుతో దోపిడీకి స్కెచ్

ముఖ్యమంత్రి, మంత్రులు ప్రజల సొమ్మును దోచుకొని దాచుకుంటున్నారని ఆరోపించారు. హ్యాం రోడ్ల పేరుతో పెద్ద దోపిడీకి స్కెచ్ వేశారని, 10 రూపాయల ఖర్చుతో చేసే పనిని 50 రూపాయలతో చేస్తూ వందల కోట్లు కమిషన్లు దోచుకు తింటున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత హ్యాం రోడ్ల పేరుతో జరుగుతున్న దోపిడిపై విచారణ చేపిస్తామని వెల్లడించారు.హ్యాం రోడ్ల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో కూడా టోల్ బూత్ లు పెట్టె ప్రమాదం ఉందని పేర్కొన్నారు. నల్గొండ జిల్లాలో ఒక్క రూపాయి కూడా అభివృద్ధి జరగడం లేదు.జిల్లా మంత్రులు పదవులను అనుభవిస్తున్నారే తప్ప అభివృద్ధిపై దృష్టి పెట్టడం లేదని ఆరోపించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శేఖర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, చింతల వెంకటేశ్వర రెడ్డి,జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ రెడ్డి, సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రూ.28వేల స్మార్ట్‌ఫోన్ కేవలం రూ.15 వేలకే..

# బంపరాఫర్ ప్రకటించిన రియల్‌మీ

తక్కువ ధరలో 5జీ స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేయాలని అనుకుంటున్నారా? మీకోసమే రియల్‌మీ గుడ్‌న్యూస్ చెప్పింది. నార్జో డేస్ సేల్‌లో భాగంగా ఛ్మితీఓశీ సిరీస్‌కు చెందిన పలు 5జీ మొబైళ్లపై భారీ తగ్గింపు ప్రకటించింది. ప్రముఖ ఈ కామర్స్ వెబ్‌సైట్ అమెజాన్ వేదికగా రియల్‌మీ ఈ ఆఫర్ తీసుకొచ్చింది. జూన్ 16వ తేదీ వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉండనుంది. ఈ Narzo Days Saleలో భాగంగా నార్జో 80, నార్జో 90, నార్జో 100 సిరీస్ మొబైళ్లపై గణనీయమైన డిస్కౌంట్లను ప్రకటించింది. =ఝ్రీఎవ ఛ్మితీఓశీ 100 శ్రీఖ్ఠవ 5+ మోడల్‌తో పాటు =ఝ్రీఎవ Narzo Power 5+ మోడల్‌పై కూడా భారీ తగ్గింపు లభిస్తుంది. ఇప్పటికే ప్రకటించిన డిస్కౌంట్లతో పాటు బ్యాంక్ కార్డు ఆఫర్, క్యాష్‌బ్యాక్ సదుపాయాలతో మరింత ఆదా కూడా చేసుకునే అవకాశం ఉంది.ఈ సేల్‌లో ప్రధాన ఆకర్షణగా రియల్‌మీ నార్జో 100 లైట్ 5జీ స్మార్ట్‌ఫోన్ ఉంది. దీని అసలు ధర రూ.27,999 కాగా, ప్రస్తుతం ఆఫర్‌లో రూ.15,249కే లభిస్తోంది. అంటే దాదాపు రూ.12,750 వరకు డిస్కౌంట్ అందుతోంది. అదనంగా అమెజాన్ పే, ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డు ద్వారా చెల్లింపు చేస్తే 5 శాతం వరకు క్యాష్‌బ్యాక్ లభిస్తోంది. అంటే రూ.15వేల లోపే ఈ మొబైల్‌ను పొందే అవకాశం ఉంది.Realme Narzo 100 శ్రీఖ్ఠవ 5జీ మొబైల్‌లో 6.8 అంగుళాల డిస్‌ప్లేను అందించారు. ఇందులో 144ఎఓ రీఫ్రెష్‌రేట్ ఉండటంతో స్క్రోలింగ్, వీడియోలు చూడటం, గేమింగ్ అనుభవం మరింత సాఫీగా ఉండనుందది. ఇది మీడియాటెక్ డైమెన్సిటీ 6300 ప్రాసెసర్‌తో పనిచేస్తుంది. ఈ ఫోన్‌లో 7000ఎూఏ్ర భారీ బ్యాటరీని అందించారు. ఫొటోగ్రఫీ కోసం 13మెగాపిక్సెల్ ప్రధాన కెమెరా.. సెల్ఫీలు, వీడియో కాలింగ్ కోసం 5 మెగాపిక్సెల్ ఫ్రంట్ కెమెరాను అందించారు. ఇక 10,000ఎూఏ్ర సామర్థ్యం కలిగిన బ్యాటరీతో వచ్చిన Narzo Power 5G స్మార్ట్‌ఫోన్‌పైనా రియల్‌మీ డిస్కౌంట్లు ప్రకటించింది. దీని అసలు ధర రూ.35,999 కాగా, దీని ధరను రూ.27,999కి తగ్గించింది. అలాగే Narzo 90x 5జీ స్మార్ట్‌ఫోన్‌పై రూ.16 వేల వరకు తగ్గింపు ప్రకటించింది. దీని



అసలు ధర రూ.33,999 కాగా, ప్రస్తుతం ఈ మొబైల్ రూ17,999కే లభిస్తోంది. ఇక నార్జో 80లైట్, నార్జో 80 ప్రో 5జీ మోడళ్లపైనా రియల్‌మీ ప్రత్యేక డిస్కౌంట్లు అందుబాటులో ఉన్నాయి. అయితే ఆఫర్‌లో మొబైల్ కొనుగోలు చేసేముందు ఫోన్ స్పెసిఫికేషన్లు, ధరలు, ఆఫర్ల నిబంధనలు పరిశీలించుకోవాలని టెక్ నిపుణులు సూచిస్తున్నారు.

## ఫామ్‌హౌస్‌లో గెట్ టుగెదర్..

## సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అనుమానాస్పద మృతి



యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగిన గెట్ టుగెదర్ పార్టీ విషాదంతమైంది. ఫామ్‌హౌస్‌లో స్నేహితులంతా కలిసి నిర్వహించిన వేడుకలో ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతిచెందాడు. చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామ శివారులోని ఓ ప్రైవేటు ఫామ్‌హౌస్‌లో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న కొందరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులంతా కలిసి కొయ్యలగూడెం శివారు ఫామ్‌హౌస్‌లో గెట్ టుగెదర్ పార్టీ చేసుకున్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి మంచిర్యాల జిల్లాకు చెందిన గాండ్ల రాము (27) అనే యువకుడు హాజరయ్యాడు. ఈ క్రమంలోనే అతను అనుమానాస్పదంగా మృతిచెందాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పార్టీకి హాజరైన మిగతా స్నేహితులందర్నీ పోలీసులు విచారిస్తున్నారు.

## టీటీడీకి రూ.కోటి విరాళం అందజేసిన కోల్‌కతా ట్రస్టు



తిరుమల : వడ్డీకాసులవాడు తిరుమల వేంకటేశ్వరస్వామికి విరాళాల వర్షం కురుస్తుంది. టీటీడీ పరిధిలో నిర్వహిస్తున్న పలు ట్రస్టులకు భక్తులు విరివిగా విరాళాలను అందజేస్తున్నారు. ఆదివారం కోల్‌కతాలోని క్రిష్టాన్ ఫ్యామిలీ ట్రస్టు కు చెందిన ప్రతినిధి పదమ్ కుమార్ ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ.కోటి విరాళం అందజేశారు.ఈ మేరకు దాత టీటీడీ బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు చేతుల మీదుగా ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథంకు డీడీని అందజేశారు. కాగా ఆదివారం కేంద్ర సహాయ మంత్రి శోభా కరంద్లాజే, రాష్ట్ర మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదల ప్రకారం రంగనాయకుల మండపంలో తీర్థ,ప్రసాదాలు అందజేశారు.

## ఢిల్లీ అగ్నిప్రమాదం కేసులో కీలక మలుపు..

## అది ప్రమాదం కాదు.. కుట్ర..!



ఆగ్నేయ ఢిల్లీలోని గోవింద్‌పురి/తుగ్లకాబాద్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలో జూన్ 12న జరిగిన ఘోర అగ్నిప్రమాదం కేసులో ఊహించని మలుపు వెలుగుచూసింది. మొదట విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని భావించినప్పటికీ తాజాగా లభించిన సీసీటీవీ ఫుటేజీ పోలీసుల దర్యాప్తును పూర్తిగా మార్చేసింది. ప్రమాదం జరగడానికి కొన్ని క్షణాల ముందు ఒక గుర్తుతెలియని మహిళ భవనంలోకి వచ్చి వెళ్లిన దృశ్యాలు లభించడంతో ఇది ఉద్దేశపూర్వకంగా చేసిన సజీవ దహన కుట్ర కావచ్చు అనే కోణంలో ఢిల్లీ పోలీసులు విచారణను తీవ్రతరం చేశారు. కాగా ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోగా ఇద్దరికి తీవ్ర గాయాలపాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. జూన్ 12 తెల్లవారుజామున సుమారు 2:30 గంటల ప్రాంతంలో ఒక బహుళ అంతస్తుల నివాస భవనంలో భారీగా మంటలు చెలరేగాయి. అయితే భవనం వెలుపల ఉన్న సీసీటీవీ కెమెరాలను పరిశీలించగా తెల్లవారుజామున సరిగ్గా 2:23 గంటల సమయంలో ముసుగు ధరించిన ఒక మహిళ లోపలికి వెళ్లడం కనిపించింది. ఆమె లోపలికి వెళ్లిన కొద్దిసేపటికే భవనంలో మంటలు అంటుకున్నట్టు పెద్ద వెలుగు కనిపించింది. ఆ వెంటనే సదరు మహిళ వేగంగా భవనం నుంచి బయటకు వచ్చి నడుచుకుంటూ వెళ్ళిపోయింది. ఆమె కదలికలు అత్యంత అనుమానాస్పదంగా ఉన్నాయని తేల్చిన పోలీసులు సదరు మహిళను ఇప్పటికే గుర్తించామని, ఆమెను అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయని తెలిపారు. ఈ ఘోర ప్రమాదంలో భవనంలోని మూడో అంతస్తులో నివసిస్తున్న పంకజ్ (28), ఆయన తల్లి గుడ్డి దేవి (50), సోదరి సోని (20) మంటల్లో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు. పంకజ్ చిన్న చెల్లెలు మోని (18), అమ్మమ్మ సుశీలా దేవి (70) తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించి మిగిలిన అంతస్తుల్లోని వారిని సురక్షితంగా రక్షించారు.

## పల్నాడులో విషాదం..

## పడవ బోల్తా పడి నలుగురు గల్లంతు



అమరావతి : పల్నాడు జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. విహారయాత్రకు వెళ్లిన పడవ బోల్తా ( దీశీఫ్ ఋుజూంఱఓవం ) పడి నలుగురు గల్లంతయ్యారు. జిల్లాలోని క్రోసూరులో 10 మంది బంధువులు నదిలో పడవలో విహారయాత్రకు వెళ్లి తిరుగు ప్రయాణంలో పడవ బోల్తా పది మంది నీటమునిగిపోయారు. గమనించిన గ్రామస్థులు నీట మునిగినవారిలో ఆరుగురిని కాపాడారు. గల్లంతైన మరో నలుగురి కోసం పోలీసులు, గ్రామస్థులు గాలింపు చర్యలు మొదలు పెట్టారు.

# ఎన్డీఏ కూటమి రెండేళ్ల పాలన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టిన ప్రభుత్వం

**ఆర్టీసీ జోన్ 2 చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు**

**కూటమి ప్రభుత్వంపై విద్వేష రాజకీయాలు సరికాదు.**



ఏలూరు(ప్రశ్న న్యూస్) వైసిపి ఐదేళ్ల పాలనలో రాష్ట్ర అభివృద్ధి పూర్తిగా నిర్వీర్యమైందని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన ఇన్చార్జి రెడ్డి అప్పలనాయుడు విమర్శించారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ దేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ పాలనను సమర్థవంతంగా అమలు చేస్తుందని ఆయన పేర్కొన్నారు. దేశం రాష్ట్ర అభివృద్ధికి ఈ ముగ్గురు నాయకుల దూర దృష్టి, సమన్వయంతో కూడిన పాలనే ప్రధాన కారణం అన్నారు. ఈరోజున ప్రపంచ దేశాలు కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వాన్ని ప్రశంసిస్తున్నాయని, భారతదేశానికి ఇది గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ నాయకత్వంలో సంక్షేమం, అభివృద్ధి రెండు సమపాళ్లల్లో కొనసాగుతున్నాయని అన్నారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, విద్యా రైతు సంక్షేమ పథకాలు, సబ్సిడీలు వంటి కార్యక్రమాల ద్వారా ప్రతి వర్గానికి కూడా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. అభివృద్ధి రంగంలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయితీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖల ద్వారా గ్రామీణ రహదారుల నిర్మాణం, గిరిజన ప్రాంతాల్లో, మౌలిక సదుపాయాల కల్పన, పంచాయితీరాజ్ వ్యవస్థ బలోపేతానికి విశేషంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. పంచాయతీరాజ్ వ్యవస్థకు జాతీయస్థాయిలో 5 ఉత్తమ అవార్డులు రావడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం అన్నారు.

# ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే సహించం: తూర్పు ఎమ్మెల్యే నసీర్

**లేదంటే తగిన బుద్ధి చెబుతాం**

**వైసీపీ వైఖరికి ప్రజలు నవ్వుకుంటున్నారు**



గుంటూరు (ప్రశ్న న్యూస్) వైసీపీ శ్రేణులు ప్రజాహితమైన అంశాలపై మాట్లాడితే స్వాగతిస్తామని, ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే మాత్రం తోకలు కత్తిరిస్తామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శనివారం రాత్రి స్థానిక తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ రెండేళ్ల కాలంలో రాష్ట్రంలో సువర్ణపాలన అందించామని, వైసీపీ మాత్రం అడ్డగోలు విమర్శలు చేస్తోందని మండిపడ్డారు. రెండేళ్ల కాలంలో తల్లికి వందనం అమలు చేసినందుకా ? సూపర్ సిక్స్ ను సూపర్ హిట్ చేసినందుకా? స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం అందించినందుకా ? పింఛన్లు పెంచినందుకా ? అన్ని వర్గాలకు ప్రభుత్వ పథకాలను చేరువచేసినందుకా ? దేనికి వైసీపీ నేతలు విమర్శలు చేస్తున్నారని ప్రశ్నించారు. సైకో జగన్ బెంగళూరు విహారయాత్రలు చేస్తూ తమ కార్యకర్తలను ఉత్తేజపరిచేందుకు ప్రభుత్వంపై విమర్శలు చేస్తుంటారని దుయ్యబట్టారు. ఐదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రానికి డ్రాయర్ల కంపెనీలు కూడా తీసుకురాలేని జగన్ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని, వారి వైఖరిని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం 50 వేల కోట్ల రూపాయలతో అమరావతి నిర్మాణాన్ని చేపట్టిందని తెలిపారు. పోలవరంతోపాటు పారిశ్రామిక ప్రగతికి బాటలు వేసిందన్నారు. గూగుల్ తో పాటు ప్రధాన కంపెనీలు రాష్ట్రానికి క్యూ కట్టాయని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో దేశంలో ఎక్కడా లేనివిధంగా డీఎస్సీని సమర్థవంతంగా అమలు చేశామన్నారు. తాము ప్రజలకు 24 గంటలపాటు అందుబాటులో ఉంటామని, ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. ఏదైనా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలపై మాట్లాడాలని హితవు పలికారు. గుంటూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పిల్లి మాణిక్యాలరావు మాట్లాడుతూ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రానికి మహర్దశ తీసుకొచ్చామని తెలిపారు ప్రతి గడపలోనూ సంతోషాలు కనిపిస్తున్నాయని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాకుండా చెప్పని కార్యక్రమాలను అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

# కర్నూల్ లో భారీ జాబ్ మేళా ముఖ్యఅతిథిగా పాల్గొన్న: మంత్రి టీజీ భరత్ గుప్తా

**యువత జాబ్ మేళా ను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలి**

**యువతకు 5 సం"లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం:పరిశ్రమలు, వాణిజ్యం ఫుడ్ ప్రోసెసింగ్ శాఖ మంత్రి టి జి భరత్ గుప్త**




కర్నూలు(ప్రశ్న న్యూస్) ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న జాబ్ మేళాలను యువత సద్వినియోగం చేసుకోవాలని తద్వారా అనుభవం సాధించి భవిష్యత్తు లో మంచి అభివృద్ధి సాధించాలని కర్నూలు క్లస్టర్ యూనివర్సిటీ జాబ్ మేళా సమావేశంలో యువతను ఉద్దేశించి పరిశ్రమలు, వాణిజ్యం ఫుడ్ ప్రోసెసింగ్ శాఖ మంత్రి టి జి భరత్ గుప్త పేర్కొన్నారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపల్ నాగరాజు శెట్టి , డిస్టిక్ స్కిల్ డెవలప్మెంట్ అధికారి ఆనందరాజ కుమార్, రిజిస్ట్రార్ శ్రీనివాసులు యువత అభివృద్ధి చెందడానికి పలు సూచనలు తెలియజేశారు. అడ్మినిస్ట్రేటర్ అక్తర్ భాను , సమావేశము లో పాల్గొన్నారు.

# వైభవోపేతంగా శ్రీ వేణుగోపాలస్వామివారి రథోత్సవం

**రుక్మిణి-సత్యభామ సమేతుడై భక్తులను అనుగ్రహించిన గోకులానందుడు**



కార్వేటినగరం(ప్రశ్న న్యూస్) శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ఉదయం నిర్వహించిన రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. గోవింద నామస్మరణలు, మంగళ వాద్యాలు, భజన బృందాల కీర్తనల మధ్య స్వామివారు దివ్య రథాన్ని అధిష్టించి గ్రామ వీధుల్లో విహరించి భక్తులకు మంగళ దర్శనం ప్రసాదించారు. ఉదయం 7.30 గంటలకు ప్రారంభమైన రథోత్సవంలో భక్తులు భక్తి శ్రద్ధలతో రథాన్ని లాగగా, అడుగడుగునా కర్పూర హారతులతో స్వాగతం పలికారు. డప్పు వాయిద్యాలు, కోలాటాలు, భజనలతో గ్రామమంతా ఆధ్యాత్మికోత్సాహంతో కళకళలాడింది. రథం యథాస్థానానికి చేరుకున్న అనంతరం వేదపారాయణం, ప్రబంధ పఠనం, శాత్తుమొర, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. రథోత్సవం చాటిచెప్పే ఆత్మతత్త్వ సందేశం వేదాంత దృష్టిలో ఆత్మనే రథికుడు, శరీరమే రథం, బుద్ధి సారథి, మనస్సు పగ్గం, ఇంద్రియాలు గుర్రాలు, విషయాలు వీధులుగా భావిస్తారు. ఈ రథోత్సవం ద్వారా శరీరానికి అతీతమైన ఆత్మస్వరూపాన్ని గ్రహించి ఆత్మానాత్మ వివేకాన్ని పెంపొందించుకోవాలనే గొప్ప తాత్త్విక సందేశాన్ని స్వామివారు భక్తులకు అందిస్తున్నారు.బ్రహ్మోత్సవాల చివరి రోజైన జూన్ 14 ఆదివారం ఉదయం 7.30 నుంచి 9.45 గంటల వరకు చక్రస్నానం వైభవంగా నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రం 5.30 గంటలకు ధ్వజావరోహణం జరగడంతో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

# వ్యవసాయ యాంత్రీకరణతో రైతులకు మరింత మేలు

**- ఎమ్మెల్యే గౌతు శిరీష.**




వజ్రపుకొత్తూరు(ప్రశ్న న్యూస్) మండలంలోని ఎఫ్పీఓ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ సాగు యంత్రాల బ్యాంకు "కస్టమ్ హైరింగ్ సెంటర్" ను పలాస నియోజకవర్గ ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులకు ఆధునిక వ్యవసాయ యంత్రాలు అందుబాటులోకి రావడం వల్ల సాగు ఖర్చులు తగ్గడంతో పాటు వ్యవసాయ పనులు వేగవంతంగా పూర్తవుతాయని తెలిపారు. చిన్న, సన్నకారు రైతులు ఖరీదైన వ్యవసాయ యంత్రాలను కొనుగోలు చేయలేని పరిస్థితుల్లో కస్టమ్ హైరింగ్ సెంటర్ ద్వారా తక్కువ అద్దెకు యంత్రాలను పొందడం ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభివృద్ధి కోసం వ్యవసాయ యాంత్రీకరణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని ఎమ్మెల్యే గారు తెలిపారు. రైతులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకొని ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని సూచించారు.అనంతరం కస్టమ్ హైరింగ్ సెంటర్లో అందుబాటులో ఉన్న వివిధ వ్యవసాయ యంత్రాలను ఎమ్మెల్యే పరిశీలించి, వాటి వినియోగంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు ఎంపీడీఓ వ్యవసాయ శాఖ అధికారులు, వెలుగు సిబ్బంది ఎఫ్పీఓ ప్రతినిధులు, వజ్రపు కొత్తూరు మండల అధ్యక్ష కార్యదర్శులు ఇతర ముఖ్య నాయకులు, స్థానిక నాయకులు, రైతులు ప్రజలు పాల్గొన్నారు.

## పత్రికా విలేఖలకు నమస్కారం పి.ఎస్ పెరుమాళ్ రెడ్డి



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం తొట్టంబేడు గ్రామం సర్వే నెంబర్ 298/3 లో 1,78, సెంట్లు భూమిని పెరుమాళ్ రెడ్డి తండ్రి శ్రీనివాసులు రెడ్డి అనే నేను సెటిల్మెంట్ ల్యాండ్ ను 2016 సంవత్సరంలో తిరుపతి వాస్తవులు భవాని నగర్ రూప్ చంద్ తండ్రి శ్రీనివాసులు శెట్టి దగ్గర కొనుగోలు చేయడం జరిగింది. శ్రీకాళహస్తి మున్సిపాలిటీ అధికారులు ఈ భూమి మాది అని మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారు. మాకు హైకోర్టు ఆర్డర్ ఉన్న లెక్కచేయకుండా మా సెటిల్మెంట్ ల్యాండ్ లో మమ్మల్ని ఇబ్బందులు పెడుతున్నారు. నా సెటిల్మెంట్ ల్యాండ్ లో శ్రీకాళహస్తి మున్సిపల్ అధికారులు రూమ్ నిర్మాణం చేపడుతున్నారు . నా సెటిల్మెంట్ ల్యాండ్ లో రూమ్ నిర్మిస్తున్నారు నిర్మించకూడదు అని చెప్పినా వినడం లేదు. హైకోర్టు పర్మినెంట్ ఇంజక్షన్ ఆర్డర్ ఉన్న శ్రీకాళహస్తి మున్సిపాలిటీ అధికారులు లెక్కచేయకుండా కోర్టు ఆర్డర్ ను ధిక్కరిస్తున్నారు. ఒకసారి విచారణ చేపట్టి మాకు తగు న్యాయం చేయవలసిందిగా అధికారులను కోరుతున్నామని తెలియజేశారు.

# 15వ వార్డులో మోరీలు, బిర్జీల మరమ్మతు పనులు ప్రారంభం



గజ్వేల్ (ప్రశ్న న్యూస్)గజ్వేల్ మున్సిపాలిటీ 15వ వార్డులోని బాలాజీ థియేటర్ రోడ్డుపై మోరీలు, బిర్జీలు జామ్ కావడంతో పాటు కొన్ని ప్రాంతాల్లో కూలిపోవడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వార్డు కౌన్సిలర్ నక్క సంతోష్ రాములు గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నక్క రేగొండ గౌడ్ ఆధ్వర్యంలో మరమ్మతు,నిర్మాణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా వారు వార్డులోని సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలించి, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. దెబ్బతిన్న మోరీలు, బిర్జీల పునర్నిర్మాణంతో పాటు నీటి పారుదల వ్యవస్థ సక్రమంగా ఉండేలా పనులను వేగవంతంగా నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమంలో షకీల్ హైదర్ షరీఫ్ పాల్గొని పనుల నిర్వహణలో సహకారం అందించారు. వార్డులో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తున్న నాయకులను స్థానిక ప్రజలు అభినందించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని, వార్డులో అవసరమైన అభివృద్ధి పనులను నిరంతరం కొనసాగిస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు.

# స్వలాభం కోసమే అంబేద్కర్ సంఘంపై దుష్ప్రచారం..

**అడహాక్ కమిటీ చెల్లదు**



కీసర (ప్రశ్న న్యూస్) కీసర మండల అంబేద్కర్ సంఘానికి అడహాక్ కమిటీని ఏర్పాటు చేసే ప్రసక్తే లేదని, ప్రస్తుత కమిటీయే యథావిధిగా కొనసాగుతుందని సంఘం సీనియర్ నాయకులు స్పష్టం చేశారు. ఆదివారం కీసర పెద్దమ్మ ఆలయ ప్రాంగణంలో మండల అంబేద్కర్ సంఘం ముఖ్య నాయకుల అత్యవసర సమావేశం నిర్వహించారు. సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సంఘం బలోపేతం, ప్రస్తుత పరిణామాలపై క్షుణ్ణంగా చర్చించి పలు కీలక తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు చినింగిని కృష్ణ, శీలం శ్రీనివాస్, తుడుం యాదగిరి, మంచాల రాజలింగం, శీలం మల్లేష్, చినింగని బాల్ రాజ్, బంటు శ్రీనివాస్, కుంటోళ్ల వెంకటేష్, కుంటోళ్ల బాల్ రాజ్ తదితరులు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. అయితే, కీసర మండల అంబేద్కర్ సంఘంపై ఎలాంటి ఆధారాలు లేకుండా, కేవలం వ్యక్తిగత కక్షలు, స్వలాభం కోసమే మండలంలో కొందరు నలుగురు వ్యక్తులు తప్పుడు ఆరోపణలు, నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. మండల కమిటీలో ఏవైనా వ్యత్యాసాలు లేదా భేదాభిప్రాయాలు ఉంటే సానుకూల చర్చల ద్వారా పరిష్కరించుకోవాలే తప్ప, సంఘం గౌరవానికి భంగం కలిగించేలా ప్రవర్తించడం సరికాదన్నారు. అనవసర గొడవలకు తావిచ్చేలా 'అడహాక్ కమిటీ' అంటూ కొత్త డ్రామాలకు తెరలేపడం ఏంటని వారు ప్రశ్నించారు. మహనీయుడి విగ్రహంపై మూత్రం పోసిన అంశాన్ని పదే పదే సోషల్ మీడియాలో పెడుతూ అనవసర ప్రచారం చేయడాన్ని మానుకోవాలని ఈ సందర్భంగా సీనియర్ అంబేద్కర్ సంఘం గట్టిగా తీర్మానించింది. కీసర మండల అంబేద్కర్ సంఘంలో అడహాక్ కమిటీకి ఎలాంటి అవకాశం లేదని తేల్చిచెప్పారు.ఈ కార్యక్రమంలో మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కర్రె గణేష్, ఉపాధ్యక్షుడు గోరంటి ప్రవీణ్, కోశాధికారి రొండ్ల మహేష్, సంయుక్త కార్యదర్శులు మంచాల మహేష్, తాళ్ళ కిరణ్, కుర్రి పరమేష్, ఎంకిరాల నర్సింగ్, సంఘం నాయకులు పుంద్రు రాకేష్, మొరుగు క్రాంతి కుమార్, పట్టా మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ తో పోరాటం.. దాతల సహకారం కోసం ఎదురుచూపులు

**- ఆశలన్నీ దాతలపైనే... చికిత్స కోసం విజ్ఞప్తి**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని బూరుగుపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి లత జీవితం ప్రస్తుతం కష్టాల సుడిగుండంలో చిక్కుకుంది. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఆమె గత ఏడాది కాలంగా చికిత్స కోసం ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆరోగ్యం క్షీణించడంతో ఎక్కువ సమయం మంచానికే పరిమితమవుతున్నారు. కుటుంబ పోషణ కోసం రోజువారీ కూలి పనులపై ఆధారపడే ఈ కుటుంబానికి వైద్య ఖర్చులు భారంగా మారాయి. లత చికిత్స కోసం ఇప్పటికే అప్పులు చేసి, చేతిలో ఉన్నంత డబ్బును ఖర్చు చేసినప్పటికీ ఇంకా చికిత్స కొనసాగించాల్సిన పరిస్థితి నెలకొంది. గత ఆరు నెలలుగా వరంగల్లోని ఎంజీఎం, ఇతర ఆసుపత్రులకు తరచూ వెళ్లి చికిత్స పొందుతున్నామని, ప్రయాణ ఖర్చులు, మందుల ఖర్చులు భరించలేకపోతున్నామని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లత ఆరోగ్యం మెరుగుపడాలంటే నిరంతర వైద్యం అవసరమని వైద్యులు సూచించడంతో కుటుంబ సభ్యులు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, దాతలు తమకు అండగా నిలవాలని కోరుతున్నారు. ఒకవైపు వ్యాధి, మరోవైపు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఈ కుటుంబానికి సహాయం అందించాలని గ్రామస్తులు కూడా విజ్ఞప్తి చేస్తున్నారు. మానవతా దృక్పథంతో ముందుకు వచ్చే దాతలు లత కుమారుడు తాళ్లపల్లి గణేష్కు ఫోన్పే/గూగుల్ పే నంబర్ 96766 96049 ద్వారా ఆర్థిక సహాయం అందించవచ్చని గ్రామస్తులు తెలిపారు. అలాగే వారి ఇంటికి వెళ్లి ప్రత్యక్షంగా కూడా సహాయం చేయవచ్చని పేర్కొన్నారు."చిన్న సహాయం అయినా ఒక ప్రాణాన్ని కాపాడే గొప్ప చేయూతగా మారుతుంది" అని గ్రామస్తులు భావోద్వేగంగా విజ్ఞప్తి చేస్తున్నారు.

# ప్రజా హక్కుల కోసం పోరాడే వారిని నిర్బంధించడం తగదు


**- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే : సుంకె రవిశంకర్**

**- దుండ్రపల్లిలో గోలి సందీప్ రెడ్డిని పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తున్న ఉద్యమకారులు, ప్రజా ప్రతినిధులు, ప్రశ్నించే స్వరాలపై అక్రమ కేసులు నమోదు చేయడం, అరెస్టులకు పాల్పడడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. ఆదివారం బోయినిపల్లి మండలంలోని దుండ్రపల్లి గ్రామంలో గోలి సందీప్ రెడ్డిని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్ నాయకులు కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా సుంకె రవిశంకర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను ప్రజాస్వామ్యబద్ధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ఉద్యమకారులను గౌరవించడం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ప్రజల తరఫున ప్రశ్నించే గొంతుకలను అణిచివేయాలనే ప్రయత్నాలు ఎంత చేసినా ప్రజా ఉద్యమాలను ఆపలేవని స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమం కోసం పనిచేసే నాయకులకు ఎల్లప్పుడూ ప్రజల మద్దతు, ఆశీస్సులు ఉంటాయని పేర్కొన్నారు.ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను కాపాడే దిశగా వ్యవహరించాలని, ప్రజా సమస్యలపై పోరాడుతున్న వారిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడకుండా ఉండాలని సూచించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించినప్పుడే ప్రజాస్వామ్యం బలోపేతం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో బోయిన్పల్లి మండల బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి గుంటి శంకర్,నాయకులు జంపుక ఆనంద్,ముద్దం రవి, డబ్బు తిరుపతి రెడ్డి,ఆనంద్ రెడ్డి,వెంకట్ రెడ్డి,కన్నం సాగర్, మల్లారపు చందు, వంశీ, తుంటి మదు, జాగిరి రామస్వామి, వంగ రవి, షాపి తదితరులు పాల్గొన్నారు.

# భారీ అంచనాలతో జులై 3న ‘నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్’



యువ నటుడు విరాట్ కర్ణ హీరోగా, అభిషేక్ నామా దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం ‘నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్’. మైథలాజికల్ ఫాంటసీ అడ్వెంచర్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమాను జులై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రంలో నభా నటేష్, ఐశ్వర్య మీనన్ కథానాయికలుగా నటిస్తున్నారు. గతంలో విడుదలైన ఈ సినిమా టీజర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. విజువల్స్, కాన్సెప్ట్ పరంగా సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. రహస్య నిధి అన్వేషణ, పురాణ గాథల నేపథ్యంతో కూడిన కథాంశంతో ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. తాజాగా ‘స్వామి వారి రథయాత్ర’ పేరుతో చేపట్టిన ప్రచార కార్యక్రమం సినిమాపై మరింత ఆసక్తిని పెంచింది. అభిషేక్ పిక్చర్స్, ఎన్ఐకే స్టూడియోస్ బ్యానర్లపై తెరకెక్కుతున్న ఈ చిత్రంలో జగపతి బాబు, మహేష్ మంజ్రేకర్, మురళీ శర్మ, దక్షా నగార్కర్, రిషభ్ సాహ్నీ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. భారీ తారాగణం, ఉన్నత సాంకేతిక విలువలతో వస్తున్న ‘నాగబంధం’ చిత్రం జులై 3న థియేటర్లలో ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో వేచి చూడాలి.

# అఖిల్ ‘లెనిన్’ విడుదల వాయిదా.

## కొత్త తేదీని ప్రకటించిన నాగార్జున

అక్కినేని అఖిల్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం ‘లెనిన్’ విడుదల వాయిదా పడింది. ఈ విషయాన్ని ఆయన తండ్రి, ప్రముఖ నటుడు కింగ్ నాగార్జున అధికారికంగా ప్రకటించారు. సినిమాను జూలై 10న విడుదల చేయనున్నట్లు ఆయన తన సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడించారు. ఈ వాయిదాకు గల కారణాన్ని నాగార్జున స్పష్టంగా వివరించారు. “లెనిన్ చిత్రబృందం నన్ను కలిసి, సినిమాను మరింత ప్రత్యేకంగా, 100 శాతం అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు మరికొంత సమయం కావాలని కోరారు.

వారిలోని అభిరుచి, స్ఫూర్తి చూసి నేను అంగీకరించాను” అని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అంతేకాకుండా, సినిమాపై అంచనాలు పెంచేలా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. “మనోడు జూలై 10న వస్తున్నాడు. నేను మళ్ళీ చెబుతున్నా, మీరు ఒక కొత్త అఖిల్‌ను చూస్తారు! ‘లెనిన్’ అనుభవానికి సిద్ధంగా ఉండండి” అంటూ అభిమానుల్లో ఉత్సాహం నింపారు. నాగార్జున ప్రకటనతో సినిమా విడుదల తేదీపై నెలకొన్న ఊహాగానాలకు తెరపడింది. నాణ్యమైన చిత్రాన్ని అందించాలనే లక్ష్యంతోనే చిత్రబృందం ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టమవుతోంది.





# మీనాక్షి చౌదరి పేరుతో సైబర్ మోసం.. అభిమానులకు హీరోయిన్ కీలక హెచ్చరిక!

టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న స్టార్ హీరోయిన్ మీనాక్షి చౌదరి తాజాగా తన పేరుతో జరుగుతున్న సైబర్ మోసంపై స్పందిస్తూ అభిమానులను అప్రమత్తం చేశారు. సోషల్ మీడియా విస్తరణతో పాటు సెలబ్రిటీల పేర్లను, ఫోటోలను దుర్వినియోగం చేస్తూ మోసాలకు పాల్పడే ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో, తాజాగా మీనాక్షి కూడా అలాంటి ఒక ఫేక్ అకౌంట్ వ్యవహారానికి గురయ్యారు. కొంతమంది కేటుగాళ్లు మీనాక్షి చౌదరి పేరు, ఫోటోలు మరియు ఒక ఫోన్ నంబర్‌ను ఉపయోగించి ఇండస్ట్రీ వర్గాలు, అభిమానులు, సాధారణ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేసినట్లు సమాచారం. ఈ విషయం హీరోయిన్ దృష్టికి రావడంతో వెంటనే సోషల్ మీడియా ద్వారా స్పందించారు. తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఆ నకిలీ నంబర్‌కు సంబంధించిన స్క్రీన్‌షాట్లను షేర్ చేస్తూ కీలక హెచ్చరిక జారీ చేశారు. ఈ నంబర్ నుంచి ఎవరికైనా కాల్స్ లేదా మెసేజ్‌లు వస్తే దయచేసి నమ్మకండి. అది నా అధికారిక నంబర్ కాదు. వెంటనే ఆ నంబర్‌ను రిపోర్ట్ చేయండి అంటూ మీనాక్షి అభిమానులకు విజ్ఞప్తి చేశారు. అలాగే ఈ విషయాన్ని తన దృష్టికి తీసుకొచ్చిన నెటిజన్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సెలబ్రిటీల పేర్లను ఉపయోగించి మోసాలు చేసే వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. ‘ఫెమినా మిస్ ఇండియా 2018’ రన్నరప్‌గా నిలిచిన మీనాక్షి చౌదరి, మోడలింగ్ రంగంలో గుర్తింపు తెచ్చుకున్న తర్వాత సినీ రంగంలోకి అడుగుపెట్టారు. 2021లో విడుదలైన ‘ఇచ్చట వాహనములు నిలుపరాదు’ చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఆమె, తొలి సినిమాతోనే తన అందం, నటనతో ఆకట్టుకున్నారు. అనంతరం అడివి శేష్ హీరోగా తెరకెక్కిన ‘హిట్: ది సెకండ్ కేస్’ చిత్రంలో నటించి కెరీర్‌లో తొలి భారీ విజయాన్ని అందుకున్నారు. ఈ సినిమా తర్వాత ఆమెకు వరుస అవకాశాలు వచ్చాయి. ముఖ్యంగా యువతలో మంచి క్రేజ్ సంపాదించుకున్న మీనాక్షి, టాలీవుడ్ నిర్మాతలు మరియు దర్శకుల దృష్టిని ఆకర్షించారు. సూపర్ స్టార్ మహేష్ బాబు నటించిన ‘గుంటూరు కారం’ చిత్రంలో కీలక పాత్రలో కనిపించిన మీనాక్షి, తన కెరీర్‌ను మరో స్థాయికి తీసుకెళ్లారు. అలాగే దుల్కర్ సల్మాన్ సరసన నటించిన ‘లక్కీ భాస్కర్’ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేయడంతో పాటు ఆమె నటనకు ప్రశంసలు తెచ్చిపెట్టింది.ఆ తర్వాత వచ్చిన ‘సంక్రాంతికి వస్తున్నాం’ వంటి చిత్రాల విజయాలతో మీనాక్షి వరుస హిట్లను ఖాతాలో వేసుకున్నారు. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను ఎంపిక చేసుకుంటూ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు.

# నా దృష్టిలో వారే నిజమైన సూపర్‌స్టార్స్



సోషల్ మీడియాలో ట్రోలింగ్ కారణంగా గత కొంతకాలంగా ఇబ్బందులు ఎదుర్కొంటూ, మౌనంగా భరించిన బుట్టబొమ్మ పూజా హెగ్డే, తాజాగా నోరు విప్పింది. తనపై వస్తున్న నెగెటివిటీకి చెక్ పెడుతూ, ట్రోలర్స్‌కి సరైన సమాధానం ఇచ్చింది. ‘నాకు ఇన్‌స్టాలో 30 మిలియన్ల కంటే ఎక్కువమంది ఫాలోవర్లున్నారు. అంతమాత్రాన నా సినిమా విడుదలైతే వారంతా టికెట్లు కొంటారని అనుకోవడం పొరపాటు. సోషల్ మీడియా ఫాలోయింగ్ అనేది జస్ట్ నంబర్ అంతే. అది సినిమా విజయంపై ఏ మాత్రం ప్రభావం చూపలేదు. ఇండస్ట్రీలో కొంతమందికి సోషల్ మీడియాలో కేవలం 5 మిలియన్ల ఫాలోవర్లే ఉంటారు. కానీ థియేటర్లలో వారికి ఉండే క్రేజ్ నెక్ట్స్ లెవల్. వారి సినిమాలు బాక్సాఫీస్ వద్ద వందల కోట్ల కలెక్షన్లు రాబడతాయి. నా దృష్టిలో వారే నిజమైన సూపర్‌స్టార్స్. దీన్ని బట్టి నేను చెప్పేదేంటంటే.. నాలాంటి హీరోయిన్లకు ప్రేక్షకులే ముఖ్యం. ఏమాత్రం ఉపయోగం లేని ఇన్‌స్టా ఫాలోవర్స్ కాదు’ అంటూ ఘాటుగా స్పందించింది పూజా హెగ్డే.

# మహిళా సాధికారత నేపథ్యంలో ‘అభయ’..

## ఆకట్టుకుంటున్న టైటిల్ పోస్టర్!

మహిళా సాధికారత నేపథ్యంలో పాన్ ఇండియా లెవెల్‌లో రూపొందుతున్న ‘అభయ’ సినిమా టైటిల్ పోస్టర్ విడుదలైంది. గ్రాడియెంటే ఇన్ఫోటైన్‌మెంట్ లిమిటెడ్ అధినేత డా. విమల్ రాజ్ మాథుర్, ఆర్.డి.జి ప్రొడక్షన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన రూపేష్ డి. గోహిల్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. యూసఫ్ ముజామ్మిల్ సుర్తి దర్శకత్వంలో తెలుగు, హిందీ, మరాఠీ, తమిళ భాషల్లో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో యోగిత భోసాలె ప్రధాన పాత్రలో నటిస్తుండగా, మోహన్ జోషి, గణేష్ యాదవ్, కమలేష్ సావంత్, అనికేత్ కేల్కర్, రోహిత్ కోకటి, ఉమేష్ బోల్కె, డా. సంజీవ్ కుమార్ పాటిల్, హర్ష్ నికమ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.ఈ సందర్భంగా నిర్మాత డా. విమల్ రాజ్ మాథుర్ మాట్లాడుతూ, అభయ కేవలం సినిమా మాత్రమే కాదని, సమాజానికి ఒక బలమైన సందేశమని పేర్కొన్నారు. తరతరాలుగా ఎందరికో ప్రేరణగా నిలుస్తున్న మహిళల శక్తిని, పట్టుదలను ఈ చిత్రం ద్వారా సెలబ్రేట్ చేయబోతున్నామని, త్వరలోనే సినిమా వివరాలను వెల్లడిస్తామని చెప్పారు. మరో నిర్మాత రూపేష్ డి. గోహిల్ మాట్లాడుతూ, ఈ సినిమా ఒక అర్థవంతమైన సందేశాన్ని అందించడమే కాకుండా, బలమైన కథనంతో సాగుతుందని తెలిపారు. ఈ ప్రేరణాత్మక చిత్రాన్ని త్వరలోనే దేశవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నామని ఆయన వివరించారు.



## శ్రీశైల స్వామి అమ్మవార్లకు బంగారు , వెండి వస్తువుల సమర్పణ: ఈవో



శ్రీశైలం (ప్రశ్న న్యూస్) కాకినాడ జిల్లా, పెద్దాపురానికి చెందిన శ్రీ లలితా ఎంటర్ ప్రైజెస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, మేనేజింగ్ డైరెక్టర్, శ్రీ మట్టే శ్రీనివాస్, విద్యుల్లత దంపతులు శ్రీ స్వామిఅమ్మవార్లకు పలు వెండి వస్తువులను, బంగారు అభరణాలను సమర్పించారు. బంగారు నామాలు చంద్రవంక కలిగిన వెండి జటాజూటం, పలు వెండి పూజావస్తువులు బంగారు రుద్రాక్షమాల, మంగళసూత్రాలను వీరు సమర్పించడం జరిగింది. కాగా సమర్పించబడిన మొత్తం వెండి వస్తువుల బరువు 42 కేజీల 516 గ్రాములు కాగా, బంగారు అభరణాల బరువు 73 గ్రాముల 500 మిల్లీ గ్రాములు. వీటి విలువ సుమారు కోటి రూపాయల దాకా ఉంటుందని దాతలు తెలియజేశారు. ఈ బంగారు అభరణాలు వెండివస్తువులను దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు ఆలా అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మట్టే శ్రీనివాస్ కుటుంబసభ్యులైన రోహన్, రాకేష్ సౌత్ ఇండియన్ షాపింగ్ మాల్ డైరెక్టర్ ఆదిత్యకృష్ణ తదితరులు కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు కి అందజేయడం జరిగింది. కార్యక్రమములో స్వామివార్ల ప్రధానార్చకులు వీరయ్యస్వామి, అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు విజయకుమార్ స్వామి, సహాయ కార్యనిర్వహణాధికారి జి. స్వాములు, అమ్మవారి ఆలయ పర్యవేక్షకులు గంజిరవి, ధర్మప్రచార పర్యవేక్షకులు నాగేశ్వరరావు, అమ్మవారి ఆలయ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, ముఖ్యభద్రతా అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం వీరికి తగు రశీదును అందజేసి వేదాశీర్వచనముతో శ్రీస్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలను, ప్రసాదాలు అందజేయడం జరిగింది.

## కుటుంబ సమేతంగా తిరుమల వేంకటేశ్వరుడుని దర్శనం చేసిన మంత్రి అచ్చెన్నాయుడు



అమరావతి(ప్రశ్న న్యూస్) రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కుటుంబ సమేతంగా తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి, తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారిని, కాణిపాకం వరసిద్ధి వినాయక దేవస్థానాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజల సుఖసంతోషాలు, రైతాంగ సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ప్రార్థనలు చేసినట్లు మంత్రి తెలిపారు. అలాగే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజల ఆశీర్వాదం, సహకారంతో ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధిస్తూ ముందుకు సాగుతోందని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో పారదర్శక పాలన, సంక్షేమం, అభివృద్ధి అనే ద్వంద్వ లక్ష్యాలతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, పేద , మధ్యతరగతి కుటుంబాల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. దేవాదాయ దర్శనాల సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుభిక్షం కలగాలని శ్రీ వేంకటేశ్వర స్వామి, పద్మావతి అమ్మవారు, వరసిద్ధి వినాయక స్వామివారిని ప్రార్థించినట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రజల విశ్వాసమే మా బలం రాష్ట్రాభివృద్ధే మా ధ్యేయం అని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

## మద్య నిషేధం అని హామీతో నమ్మించి, కల్తీ మద్యంతో 30 వేల మంది ప్రాణాలు తీసి వేల కోట్ల దోపిడీకి పాల్పడ్డాడు

**- అమరావతి రైతులను రక్తం వచ్చేలా కొట్టించాడు; జీఓ 117 తెచ్చి 12 లక్షల మంది పేద పిల్లల చదువులను దూరం చేశాడు .**

**- ప్రజలు 11 సీట్లకు పరిమితం చేసినా అలజడులు ఆపని జగన్‌ను, అతని గొడ్డలి పార్టీని రాష్ట్రం నుండి పూర్తిగా పారద్రోలాలి.**

**- ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర**



మంగళగిరి (ప్రశ్న న్యూస్ ) రాష్ట్రంలో గొడ్డలిపోటుకు, వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ ఎవరైనా ఉన్నారంటే అది వైఎస్ జగన్ మోహన్ రెడ్డేనని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిగా తుంగలో తొక్కి, ప్రజలను నిలువునా ముంచి వెన్నుపోటు పొడిచాడు.

సొంత బాబాయి వైఎస్ వివేకానందరెడ్డిని గొడ్డలితో నరికి చంపిన నిందితులను కాపాడుతూ, ఆ హత్యకు కారకులను వెనకేసుకొస్తూ.. కన్నతండ్రి చావుకు న్యాయం చేయాలని పోరాడుతున్న తోడబుట్టిన చెల్లి షర్మిలపైనే నిందలు వేయాలని చూసిన సైకో జగన్ రెడ్డి. ఆస్తుల కోసం తల్లిని ఇల్లు వదిలి వెళ్లేలా చేసి, తోడబుట్టిన చెల్లికి తండ్రి ఆస్తిలో సగం భాగం ఇవ్వాలనే మహిళా ఆస్తి హక్కు చట్టానికి వెన్నుపోటు పొడిచాడు. చివరికి న్యాయం అడిగిన సొంత చెల్లిని కూడా వదలకుండా మోసం చేసిన ఘనుడు జగన్ రెడ్డి అన్నారు.

# దక్షిణాదిలో కాంగ్రెస్ జైత్రయాత్రకు నాంది

**- దేశ రాజకీయాల్లో కాంగ్రెస్‌కు కొత్త ఊపు తెచ్చే నాయకుడు డీకే**

**- బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగట్టాలి - టీపీసీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ పన్యాల శ్రవణ్ కుమార్ రెడ్డి**

**- నూతన ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపిన డాక్టర్ శ్రవణ్ కుమార్ రెడ్డి**

మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) కర్ణాటక రాష్ట్ర రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకుంటూ కాంగ్రెస్ పార్టీకి కొత్త శక్తినిస్తున్న ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు డాక్టర్ శ్రవణ్ కుమార్ రెడ్డి తెలిపారు.దక్షిణాది రాష్ట్రాల్లో కాంగ్రెస్ జైత్రయాత్రకు నాంది పలుకుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల కర్ణాటక సీఎం గా బాధ్యతలు చేపట్టిన డీకే శివ కుమార్ ను ఆదివారం బెంగుళూరు లో డాక్టర్ శ్రవణ్ కుమార్ రెడ్డిమర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీకే శివకుమార్‌కు పుష్పగుచ్ఛం అందించి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.అనంతరం శ్రవణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో డీకే శివకుమార్ పాత్ర కీలకమన్నారు.కాంగ్రెస్ పార్టీకి సంక్షోభ సమయంలో అండగా నిలిచి, కర్ణాటకలో పార్టీని విజయపథంలో నడిపించిన డీకే శివకుమార్ నాయకత్వం దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులకు స్ఫూర్తిగా నిలుస్తోందని డాక్టర్ శ్రవణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై పోరాటం చేసే నాయకత్వమే కాంగ్రెస్ బలమని ఆయన అభిప్రాయపడ్డారు.బీజేపీ వైఫల్యాలపై ప్రజల్లో చైతన్యం అవసరమన్నారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతాంగ సమస్యలు, ప్రజాస్వామ్య వ్యవస్థల బలహీనత వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగాలని కోరారు. తెలంగాణ-కర్ణాటక కాంగ్రెస్ సమన్వయానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. దక్షిణ భారత రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం, యువ నాయకత్వాన్ని ప్రోత్సహించడం, ప్రజా సమస్యలపై ఉమ్మడి పోరాటాలకు కార్యాచరణ రూపొందించడం వంటి అంశాలపై సీఎం తో చర్చించినట్లు శ్రవణ్ కుమార్ రెడ్డి తెలిపారు. సీఎం డీకే శివకుమార్ నాయకత్వంలో కర్ణాటకలో కాంగ్రెస్ సాధించిన విజయాలు దేశవ్యాప్తంగా పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపాయని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడేందుకు సమష్టిగా కృషి చేయాలని ఆయన కోరారు.ఈ సందర్భంగా దేశ రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ కార్యాచరణ, రాష్ట్రాల్లో పార్టీ బలోపేతం, యువతను కాంగ్రెస్ వైపు ఆకర్షించే వ్యూహాలు, బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లే అంశాలపై విస్తృతంగా చర్చ



జరిగినట్లు శ్రవణ్ కుమార్ రెడ్డి తెలిపారు.

# విద్యార్థినీ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ప్రతీక గా ప్రభుత్వ పాఠశాలలు కలెక్టర్ ప్రతిమ సింగ్

మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) ప్రభుత్వ పాఠశాలలు 928, ప్రైవేట్ 109 మొత్తం 1037 స్కూల్స్ పునఃప్రారంభమవుతున్నాయి1,26,000 మంది విద్యార్థులు బడిబాట పట్టనున్నారు. కలెక్టర్మా విద్యార్థుల జీవితాలకు మార్గదర్శకాలుగా నిలుస్తున్న మా ఉపాధ్యాయులకు శుభాభినందనలు.ప్రైవేట్ బడులకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకుసూచన.తరగతి గదుల్లోకి కొత్త ఉత్సాహంతో విద్యార్థినీ విద్యార్థులు అడుగు పెట్టాలి క్రమశిక్షణతో చదువుకుని ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవాలి:పాఠశాలల్లో మంచినీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం మరియు పాఠశాల పరిసరాల పరిశుభ్రతను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలి. బడిబాట కార్యక్రమంలో భాగంగా, మొదటి రోజే విద్యార్థులకు కొత్త పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందించాలని స్పష్టం ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా ప్రమాణాలు అందుబాటులో ఉన్నాయని, తల్లిదండ్రులకు భరోసా

**- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

పాఠశాలల పునఃప్రారంభం నేపథ్యంలో విద్యా ప్రణాళికకు రూపొందించుకొని పటిష్టంగా అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సోమవారం నుంచి పాఠశాలలు ప్రభుత్వ పాఠశాలలు 928 , ప్రైవేట్ పాఠశాలలు 109. మొత్తం 1037 స్కూల్స్ పునఃప్రారంభమవుతున్నాయని అందులో ప్రభుత్వ 83,000 , ప్రైవేటు 43,000 మొత్తం 1,26,000 మంది విద్యార్థులు బడిబాట పట్టనున్నారని కలెక్టర్ తెలిపారు. విద్యాశాఖ కొత్త పుస్తకాలు, విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీకి ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ఒకటో తరగతి విద్యార్థులకు ప్రత్యేక స్వాగత కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజన ఏర్పాట్లపై అధికారులు దృష్టి సాధించారన్నారు.. హాజరు శాతం పెంపు, డిజిటల్ బోధనకు ప్రాధాన్యం ఇవ్వనున్నామని తెలిపారు.విద్యార్థి విద్యార్థులు నూతన ఉత్సాహంతో పాఠశాలలో అడుగు పెట్టాలన్నారు కార్పొరేట్ స్థాయికి దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన గుణాత్మక విద్య నందిస్తున్నామని తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను పంపించే బాధ్యత తల్లితండ్రుల దేనని గుర్తు చేశారు. ఈ విద్యా



సంవత్సరాన్ని మనం ప్రారంభిస్తున్న ఈ తరుణంలో, మన పాఠశాల సామరస్యంతో, విజయంతో నిండిపోవాలని ఆకాంక్షించారు.

# సాగు పండుగకు 'కూటమి' భరోసా

## రైతన్న ముంగిటకే రాయితీ విత్తనం

శ్రీకాకుళం(ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో నూతన కూటమి ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన తర్వాత వ్యవసాయ రంగాన్ని సంక్షోభం నుంచి గట్టెక్కించి, లాభసాటిగా మార్చడమే ధ్యేయంగా అడుగులు పడుతున్నాయి. కేవలం సచివాలయాల సమీక్షలకే పరిమితం కాకుండా, రానున్న ఖరీఫ్ సీజన్ నాటికి క్షేత్రస్థాయిలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గారు ప్రత్యేక చొరవ ,వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఒక పక్కా వ్యూహంతో ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగానే అన్నదాతల ముంగిటకే రాయితీ విత్తనాలను చేరవేసే మహా యజ్ఞానికి శ్రీకారం చుట్టారు. సాగు ఖర్చును గణనీయంగా తగ్గించి, ప్రతి పెట్టుబడిపై రైతుకు ఆర్థిక భరోసా కల్పించడమే ఈ ప్రత్యేక కార్యాచరణ ముఖ్య ఉద్దేశం.

### పారదర్శక పంపిణీ: దళారీ వ్యవస్థకు ముకుతాడు

గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఎక్కడా విత్తనాల కొరత లేదా బ్లాక్ మార్కెట్ దందాలు జరగకుండా ముందస్తుగానే గ్రామాల్లోని 'రైతు సేవా కేంద్రాల' ద్వారానే నేరుగా పంపిణీ ప్రక్రియను వేగవంతం చేశారు. దీనివల్ల రైతులు పట్టణాలకు పరుగులు తీయాల్సిన అవసరం గానీ, పంపిణీ కేంద్రాల చుట్టూ తెల్లవార్లూ క్యూ కట్టాల్సిన తిప్పలు గానీ తప్పనున్నాయి. జిల్లా వ్యాప్తంగా సాగు అవసరాలను శాస్త్రీయంగా గుర్తించి, యుద్ధప్రాతిపదికన విత్తనాలను అందుబాటులో ఉంచారు. శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగానే ఏకంగా 31,058 క్వింటాళ్ల మేలు రకపు వరి విత్తనాల నిల్వలను ముందస్తుగా సమకూర్చారు. సాగు పెట్టుబడి తగ్గించేందుకు సాధారణ రైతులకు కిలో వరి విత్తనంపై పది రూపాయల రాయితీని అందిస్తుండగా, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన గిరిజన రైతులకు మరింత ఆర్థిక భరోసా కల్పిస్తూ ఏకంగా తొంభై శాతం రాయితీని ప్రభుత్వం భరిస్తోంది.



విత్తనాలు, ఎరువుల కొరత, అక్రమ నిల్వలకు తావులేకుండా పారదర్శకంగా పంపిణీ జరిగేలా వ్యవసాయ శాఖ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# దివ్యాంగులు, వృద్ధులకు భరోసా

## - ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

**- ఈ నెల 15 వ తేదీన సుమారు రూ. 4 కోట్ల విలువగల, 3 వేల మందికి పైగా దివ్యాంగులు, వయో వృద్ధుల పరికరాలు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చేతుల మీదుగా పంపిణీ.**

నంద్యాల(ప్రశ్న న్యూస్) పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న అర్హులైన దివ్యాంగులకు, వయో వృద్ధులకు తానున్నానన్న భరోసా నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి ఇస్తున్నారు. భారత ప్రభుత్వం ఏ డి ఐ పి పథకం క్రింద ఎ ఎల్ ఎం సి ఓ ద్వారా దివ్యాంగులకు సహాయ పరికరాలు, వయో వృద్ధులకు సీనియర్ సిటిజన్ల సంక్షేమశాఖ ఎ పి డి ఏ ఎస్ సి ఏ సి పథకం ద్వారా సహాయక పరికరాలు ఈ నెల 15 వ తేదీన సోమవారం ఉదయం 11 గంటలకు నంద్యాల టెక్కె వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చేతుల మీదుగా పంపిణికి ఏర్పాట్లు చేశారు. సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ వారు నిర్ధారించిన షెడ్యూల్ ప్రకారం, భారత ప్రభుత్వ ADIP పథకం కింద, ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ALIMCO) సహకారంతో, అవసరమైన దివ్యాంగులకు వివిధ సహాయ పరికరాలు, ఉపకరణాలు ఉచితంగా అందించడానికి, గత ఏడాది 28-06-2025 నుండి 18-07-2025 వరకు నంద్యాల జిల్లాలోని 07 అసెంబ్లీ నియోజకవర్గాలలో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అసెస్‌మెంట్ క్యాంపులు నిర్వహించారు. ఆ ప్రత్యేక శిభిరాల్లో అర్హులైన దివ్యాంగులు, వయో వృద్ధులను గుర్తించి వారికి అవసరమైన పరికరాలు సుమారు రూ. 4 కోట్ల విలువగల, 3 వేల మందికి పైగా లబ్ధిదారులకు అవసరమైన పరికరాలు ఇప్పటికే నంద్యాల గోదాములకు చేరుకున్నాయి.

వాటిని ఈ నెల 15 వ తేదీ నంద్యాల టెక్కె వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంబందించిన యంత్రాంగం ఏర్పాట్లు చేసి నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆధ్వర్యంలో పంపిణీ చేయనున్నారు.



# సర్కారు బడి.. సమస్యల ఒడి

- సమస్యలతో స్వాగతం పలుకుతున్న ప్రభుత్వ పాఠశాలలు
- కాలం మారుతున్నా మారని ప్రభుత్వ విద్యాలయాల తీరు
- శిథిలావస్థలో తరగతి గదులు, మరుగుదొడ్ల తీవ్ర కొరత
- మధ్యాహ్న భోజనానికి వంట గదుల సెగ
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన పాడుబడ్డ పాఠశాల భవనాలు
- ఫోరం ఫర్ ఆర్టీఐ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పర్యటన
- ఫోరం ఫర్ ఆర్టీఐ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన డిమాండ్లు



మేడ్చల్(ప్రశ్న న్యూస్) ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను పెంపొందించాలన్న ప్రభుత్వ సంకల్పానికి, అదే సర్కారు నిర్లక్ష్య ధోరణి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లోని మౌలిక వసతుల లేమి, ఇతర



తీవ్ర సమస్యలు విద్యార్థుల భవిష్యత్తును సతమతం చేస్తున్నాయి. ?ష్టంలో కాలం మారుతున్నా ప్రభుత్వ విద్యాలయాల తీరు మాత్రం మారడం లేదు. ఆచరణకు ఆమడ దూరంలో ప్రభుత్వ పాఠశాలలు దర్శనమిస్తున్నాయి. పాఠశాలల్లో కనీస మౌలిక వసతులైన తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం అంతంత మాత్రమే ఉంది. విద్యార్థులకు మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పిస్తేనే బడుల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని స్పష్టమవుతున్నా, పాలకులు మాత్రం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు.

### మధ్యాహ్న భోజనానికి వంట గదుల సెగ..

ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపరిచే పనిలో భాగంగా మధ్యాహ్న భోజనం అందజేస్తున్న క్రమంలో, క్షేత్రస్థాయిలో అనేక



ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భోజనం తయారు చేసే వంట గదుల కొరత, గ్యాస్ సిలిండర్ల కొరతతో అన్ని పాఠశాలల్లో



నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శిథిలావస్థకు చేరిన భవనాలు, అసంపూర్తిగా నిలిచిపోయిన తరగతి గదులు, వంటశాలల కొరత, నీటి సమస్యలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రతిరోజూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల పరిసరాలు చెత్తాచెదారంతో నిండి ఉండటంతో రోగాల బారిన పడే ప్రమాదం పొంచి ఉంది.

### అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన పాడుబడ్డ పాఠశాల భవనాలు..

మేడ్చల్ పట్టణంలోని అర్జున్ వాడ, రథం షాల సమీపంలో, అంగన్వాడీ కేంద్రానికి ఎదురుగా పాడుబడి ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనం ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు ప్రధాన కేంద్రంగా మారింది. ఈ పాడుబడ్డ భవనం ఇండ్ల మధ్యలో ఉండటం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. దీనికి తోడు ఈ ప్రాంతంలో పదుల సంఖ్యలో



మద్యం బెల్ట్ షాపులు వెలిశాయని, దీనిపై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం లేదని మాజీ వార్డు సభ్యులు గల్వ మహేష్ ఆవేదన వ్యక్తం చేశారు.



### ఫోరం ఫర్ ఆర్టీఐ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పర్యటన..

మేడ్చల్ పట్టణంలోని పాడుబడిన ప్రభుత్వ పాఠశాలలను, ప్రభుత్వ వసతి గృహాలను ఫోరం ఫర్ ఆర్టిఐ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ బృందం శుక్రవారం సందర్శించింది. మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు నాచారం విజయలక్ష్మి అధ్యక్షతన ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. సామాన్య ప్రజల సంక్షేమమే లక్ష్యంగా తమ అసోసియేషన్ పనిచేస్తుందని, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రమేష్ గుప్త, మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు నాచారం విజయ లక్ష్మి, ఎం.లావణ్య, మేడ్చల్ విద్యాశాఖ అధికారి శ్రీనివాస్, నర్సింహులు పటేల్, మాజీ వార్డు సభ్యులు గల్వ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఫోరం ఫర్ ఆర్టీఐ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన డిమాండ్లు..

శిథిలావస్థకు చేరిన తరగతి గదులను తక్షణమే పునర్నిర్మించి విద్యార్థినులకు, విద్యార్థులకు ప్రత్యేకంగా రక్షిత మరుగుదొడ్ల, తాగునీటి సౌకర్యం కల్పించాలి. మధ్యాహ్న భోజన పథకం సజావుగా సాగేలా ఆధునిక వంట గదులు, గ్యాస్ సిలిండర్లను సరఫరా చేయాలి. జనవాసాల మధ్య ఉన్న పాడుబడ్డ భవనాలను తొలగించి, అసాంఘిక కార్యకలాపాలకు, బెల్ట్ షాపులకు అడ్డుకట్ట వేయాలి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి విద్యావ్యవస్థ బలోపేతానికి, ప్రభుత్వ పాఠశాలల మనుగడకు తగిన నిధులు విడుదల చేసి మౌలిక వసతులు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

- పికప్ వ్యాన్ బావిలో పడి 8 మంది మృతి



షోలాపూర్ (ప్రశ్న న్యూస్) మహారాష్ట్రలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. షోలాపూర్ జిల్లాలో ప్రయాణికులతో వెళ్తున్న ఓ పికప్ వ్యాన్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బావిలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో 8 మంది మృతి చెందినట్లు పోలీసులు ఆదివారం వెల్లడించారు. మృతుల్లో నలుగురు మహిళలు, నలుగురు చిన్నారులు ఉన్నారు. పోలీసులు అందించిన ప్రాథమిక వివరాల ప్రకారం, మృతులంతా పండరీపూర్ తాలూకా రంజని గ్రామానికి చెందిన సాగర్ చౌగులే కుటుంబ సభ్యులు, బంధువులుగా గుర్తించారు. వీరంతా మాల్వాడ్‌లోని ఆలయంలో దర్శనం పూర్తిచేసుకుని తిరిగి తమ స్వగ్రామానికి వెళుతుండగా మాల్వాడ్-పండరీపూర్ మార్గంలో ఈ విషాదం జరిగింది. తాండూల్వాడి సమీపంలోకి రాగానే వాహనం అదుపుతప్పి బావిలోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన బావికి ఎలాంటి రక్షణ గోడ లేకపోవడమే ఇంతటి ఘోరానికి ప్రధాన కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై ఎన్‌సీపీ (శరద్ పవార్) ఎమ్మెల్యే రోహిత్ పవార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే సహాయం అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా పర్యవేక్షక మంత్రి జయకుమార్ గోర్ మాట్లాడుతూ.. బావికి రక్షణ గోడ లేకపోవడంపై విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్థానిక యంత్రాంగం సహాయక చర్యలను పర్యవేక్షిస్తోంది.

# మా ఫేస్‌బుక్ పేజీని బ్లాక్ చేశారు

- కూటమి ప్రభుత్వంపై జగన్ ఆగ్రహం



అమరావతి (ప్రశ్న న్యూస్) వైసీపీ అధినేత జగన్ ఏపీ కూటమి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తమ పార్టీ అధికారిక ఫేస్‌బుక్ పేజీని భారతదేశంలో కనిపించకుండా చేశారని, ఇది ప్రతిపక్షాల గొంతు నొక్కే చర్యేనని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను, అవినీతిని ప్రశ్నిస్తున్నందుకే కక్షపూరితంగా ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఈ ఏడాది ప్రారంభంలో తమ పార్టీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను తొలగించారని, ఇప్పుడు ఫేస్‌బుక్ పేజీని లక్ష్యంగా చేసుకున్నారని జగన్ ఒక ప్రకటనలో తెలిపారు. "ఇది కేవలం వైసీపీపై జరిగిన దాడి కాదు. ప్రజాస్వామ్య విలువలు, భావప్రకటనా స్వేచ్ఛపై జరిగిన దాడి" అని ఆయన పేర్కొన్నారు. ఇలా ప్రతిపక్ష పార్టీ అధికారిక ఖాతాలను నిలిపివేయడం ప్రమాదకరమని, ఇది పూర్తిగా అప్రజాస్వామికమని అన్నారు.అమరావతి రాజధాని ఖర్చులు, డీఎస్సీ ప్రక్రియలో అవకతవకలు, టీటీడీ నెయ్యి టెండర్లు వంటి అంశాలపై ఆధారాలతో సహా అవినీతిని బయటపెడుతుండటంతోనే ప్రభుత్వం ఇలాంటి చర్యలకు దిగుతోందని జగన్ ఆరోపించారు. ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలపై న్యాయపరంగా, రాజ్యాంగబద్ధంగా పోరాడతామని ఆయన స్పష్టం చేశారు. బెదిరింపులు, సెన్సార్‌షిప్‌తో తమ గొంతును అణచివేయలేరని, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయడంలో వెనక్కి తగ్గేది లేదని తేల్చి చెప్పారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడేందుకు, తమ ఫేస్‌బుక్ పేజీని తక్షణమే పునరుద్ధరించాలని జగన్ డిమాండ్ చేశారు.

# జంట జలాశయాలకు పెరిగిన వరద ప్రవాహం

- ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌కు తాజా ఇన్‌ఫ్లో



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల్లో శనివారం కురిసిన భారీ వర్షాలకు హైదరాబాద్ తాగునీటి అవసరాలు తీర్చే జంట జలాశయాలకు వరద ప్రవాహం పెరిగింది. ఉస్మాన్‌సాగర్ (గండిపేట), హిమాయత్‌సాగర్‌కు ఇన్‌ఫ్లో పెరగడంతో అధికారులు మూసీ నది పరీవాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. హైదరాబాద్ జలమండలి అధికారులు ఎప్పటికప్పుడు నీటి మట్టాలను, ఇన్‌ఫ్లోను నిశితంగా గమనిస్తున్నారు. ఆదివారం ఉదయం 6 గంటల సమయానికి అందిన సమాచారం ప్రకారం జలాశయాల్లోకి సుమారు 800 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది.

ఉస్మాన్‌సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 1,790 అడుగులు కాగా, ప్రస్తుతం 1,784.30 అడుగుల వద్ద నీరు ఉంది. అదేవిధంగా, హిమాయత్‌సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 1,763.50 అడుగులు కాగా, ప్రస్తుతం 1,760.60 అడుగుల వద్ద కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో జలమండలి ఎండీ అశోక్ రెడ్డి జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ, పోలీస్, హైడ్రా విభాగాలను అప్రమత్తం చేశారు. అందరూ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ రుతుపవనాల సీజన్‌లో జలాశయాలకు ఇదే మొదటి చెప్పుకోదగ్గ వరద ప్రవాహం. ప్రస్తుతానికి గేట్లు తెరిచేంత ప్రమాదం లేదని, ఒకవేళ పరిస్థితిని బట్టి గేట్లు ఎత్తివేయాల్సి వస్తే ఆ సమాచారాన్ని ముందుగానే ప్రజలకు తెలియజేస్తామని అధికారులు స్పష్టం చేశారు.

# కార్మికుల కనీస వేతనాలపై కేంద్రం ఉక్కుపాదం

- రోజుకు రూ.738, నెలకు రూ.20,000 కంటే తక్కువ ఇస్తే చట్టరీత్యా నేరం
- ఉల్లంఘించే యజమానులపై కఠిన చర్యలు
- కనీస వేతనం యజమాని ఇష్టం కాదు, కార్మికుని హక్కు
- తక్కువ జీతం ఇస్తే మౌనం వద్దు
- తక్షణ ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్లు
- నిపుణుల అభిప్రాయం మరియు అవగాహన

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** దేశ ఆర్థిక ప్రగతికి వెన్నెముకగా నిలుస్తున్న కార్మిక లోకానికి భరోసా కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. కార్మికులు తమ శ్రమకు తగిన ప్రతిఫలాన్ని పొందేలా చూసేందుకు కనీస వేతనాల అమలుపై పర్యవేక్షణను మరింత కఠినతరం చేసింది. ఈ నిబంధనల ప్రకారం.. నిర్దేశిత రంగాల్లో రోజుకు రూ. 738 లేదా నెలకు రూ. 20,000 కంటే తక్కువ వేతనం చెల్లించడం చట్టవిరుద్ధమని, నిబంధనలు ఉల్లంఘించే యజమానులపై చట్టపరమైన చర్యలు తప్పవని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. దేశవ్యాప్తంగా ప్రైవేట్ సంస్థలు, పరిశ్రమలు, కాంట్రాక్ట్ రంగాలు, నిర్మాణ రంగం వంటి అసంఘటిత రంగాలలో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికుల హక్కులను కాపాడటమే లక్ష్యంగా ఈ చర్యలు ముమ్మరమయ్యాయి.

### కనీస వేతనం యజమాని ఇష్టం కాదు... కార్మికుని హక్కు:

కార్మికుడు తన కుటుంబానికి అవసరమైన ఆహారం, నివాసం, ఆరోగ్యం, మరియు విద్యా సదుపాయాలను గౌరవప్రదంగా పొందేందుకు కనీస ఆదాయం అత్యంత కీలకం. కనీస వేతనం అనేది యాజమాన్యాలు తమ ఇష్టానుసారంగా నిర్ణయించేది కాదు, ఇది చట్టబద్ధంగా నిర్దేశించిన హక్కు. ఒకవేళ ఏ సంస్థ అయినా అంతకంటే తక్కువ వేతనం చెల్లిస్తే, అది కార్మిక హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుంది.

### తక్కువ జీతం ఇస్తే మౌనం వద్దు :

చాలా సందర్భాలలో ఉద్యోగం పోతుందనే భయంతో కార్మికులు తమకు జరుగుతున్న అన్యాయాన్ని భరిస్తున్నారు. అయితే, చట్టం ఎల్లప్పుడూ కార్మికుల పక్షాన ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. తక్కువ వేతనం ఇస్తున్నట్లయితే, కార్మికులు మౌనంగా ఉండకుండా చట్టపరమైన పోరాటానికి సిద్ధం కావాలి. దీనికోసం తాము పని చేస్తున్న సంస్థకు సంబంధించిన జీతం చెల్లింపు రికార్డులు, బ్యాంకు ఖాతా స్టేట్‌మెంట్లు, హాజరు రిజిస్టర్ నకళ్లు మరియు నియామక పత్రాల వంటి కీలక ఆధారాలను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



### తక్షణ ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్లు :

వేతనాల విషయంలో మోసపోతున్న లేదా అన్యాయానికి గురవుతున్న కార్మికులు నేరుగా లేబర్ హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ నంబర్లు అయిన 15521414434 మరియు 18008896811 ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఫోన్ ద్వారానే కాకుండా, కేంద్ర కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వ శాఖకు చెందిన అధికారిక డిజిటల్ పోర్టల్ శ్రీఖఎశీబతీ.స్త్రశీజ.అఅ ద్వారా కూడా ఆన్‌లైన్‌లో తమ సమస్యలను నమోదు చేసుకోవచ్చు. ఈ ఫిర్యాదులపై సంబంధిత కార్మిక శాఖ అధికారులు తక్షణమే స్పందించి విచారణ జరుపుతారు. కార్మిక సంఘాల నేతలు, హక్కుల కార్యకర్తల అభిప్రాయం ప్రకారం.. చట్టాలు ఎన్ని ఉన్నప్పటికీ, అవి క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు అయినప్పుడే కార్మికుల జీవితాల్లో వెలుగులు నిండుతాయి. ముఖ్యంగా గ్రామీణ, అసంఘటిత రంగాల కార్మికులకు ఈ కనీస వేతన చట్టాలపై విస్తృత అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. మీ శ్రమకు తగిన వేతనం పొందడం మీ ప్రాథమిక హక్కు అని, అన్యాయం జరిగినప్పుడు మౌనంగా ఉండకుండా, చట్టం అండతో హక్కులను సాధించుకోవాలని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588